RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 39 ISSUE NO : 39 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం, జూలై, 26 , 2025 Saturday, July, 26, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## అమర్‌నాథ్ యాత్ర..

## 21 రోజుల్లో 3.52 లక్షలకు పైగా మంది

# దర్శనం...

**- జులై 3న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర**

జమ్మూ జులై 3న ప్రారంభమైనప్పటి నుంచి గత 21 రోజుల్లో అమర్‌నాథ్ యాత్ర చేస్తున్న యాత్రికుల సంఖ్య 3.50 లక్షలను దాటిందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3.52 లక్షలకు పైగా భక్తులు అమర్‌నాథ్ యాత్రలో పాల్గొన్నారని వెల్లడించారు. జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి రెండు బేస్ క్యాంపులకు రెండు ఎస్కార్ట్ కాన్వాయ్‌లలో 2,896 మంది యాత్రికుల బృందం శుక్రవారం బయలుదేరిందని తెలిపారు. 790 మంది యాత్రికులతో 42 వాహనాలతో కూడిన మొదటి ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 3:30 గంటలకు బాల్టాల్ బేస్ క్యాంపుకు బయలుదేరింది. అలాగే 2,106 మంది యాత్రికులతో 75 వాహనాలతో కూడిన రెండవ కాన్వాయ్ తెల్లవారుజామున 4:18 గంటలకు పహల్గామ్ బేస్ క్యాంపుకు బయలుదేరిందని అధికారులు తెలిపారు. ఇక, గురువారం శ్రీనగర్‌లోని చారిత్రాత్మక శంకరాచార్య ఆలయానికి మహంత్ దీపేంద్ర గిరి నేతృత్వంలోని సాధువుల బృందం 'చారీ ముబారక్' (శివుని పవిత్ర గద)ను ఆచార పూజల కోసం తీసుకెళ్లింది.



## ప్రధాని మోడీ విదేశీ పర్యటనల ఖర్చు

# రూ.350 కోట్లు

**ఎంఈఏ వెల్లడి**

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ విదేశీ పర్యటనల కోసం రూ.350 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం ప్రకటించింది. 2021 నుండి 2025 మధ్య ప్రధాని పర్యటనల కోసం దేశ ఖజానా నుండి సుమారు రూ. 300 కోట్లు వరకు ఖర్చు చేసినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అమెరికా, ఫ్రాన్స్, మారిషస్, థాయిలాండ్, శ్రీలంక, సౌదీ అరేబియా పర్యటనకు ఖర్చు చేసిన రూ.67 కోట్లు కూడా ఇందులో ఉన్నాయి.



## తెలంగాణ కేబినెట్ భేటీ

# వాయిదా

**28న జరపాలని సిఎం**

హైదరాబాద్, తెలంగాణ దిశ : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25వ తేదీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ భేటీ వాయి దా పడింది. ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు- తెలుస్తోంది. మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినట్లు- సమాచారం.



## అప్పుడు తప్పుచేశా, ఇప్పుడు

# సరిదిద్దుకుంటున్నా

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పదమేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన భాగిదారి న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఒకసారి వెనక్కి తిరిగి చూసినప్పుడు తాను ఓ తప్పు చేశానని అర్థమవుతోందని అన్నారు. ఓబీసీల హక్కులను రక్షించాల్సిన విధంగా రక్షించలేదని, అప్పట్లో ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయనని పేర్కన్నారు.'మీ (ఓసీసీలు) చరిత్ర, మీ సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పుకాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని రాహుల్ అన్నారు. తెలంగాణ రోల్‌మోడల్: తెలంగాణ కులగణన దేశానికి రోల్‌మోడల్ అని రాహుల్ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఇది తన శపథమని అన్నారు.



## కుప్పకూలిన ప్రభుత్వ పాఠశాల

# భవనం

**ఏడుగురు విద్యార్థులు మృతి**

**15మందికి గాయాలు**

ఢిల్లీ,: రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం(జూలై25) ఉదయం క్లాసులు నడుస్తుండగా ఆకస్మికంగా భవనం పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ లోని ఘలావర్ జిల్లాలోని పిప్లోడి ప్రాథమిక పాఠశాలలో పైకప్పు కూలిపోయింది.



## ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను

# కొట్టివేసిన సుప్రీంకోర్టు

**- రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌పై పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత**

ఢిల్లీ,: ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి 2022లో పిటిషన్ దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన సమయంలో.. ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది.



## ఇ-గవర్నెన్స్, డిజిటలైజేషన్ లో

## ఎస్తోనియా సహకారం

# తీసుకుంటాం

**-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

మంథని,జూలై 25, తెలంగాణ దిశ : ఇ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన 'ఎస్తోనియా' సహకారం తీసుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ రెండు రంగాల్లో ఎస్తోనియా దేశం అగ్రగామిగా ఎదగడం అబ్బురపరుస్తోందని ఆయన ప్రశంసించారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో సచివాల యంలో తనను కలిసిన వాణిజ్య ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. వీరిలో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, రోబోటి క్స్, ఆరోగ్యరంగాల ప్రతినిధులు ఉన్నారు. తెలంగా ణా రాష్ట్రం ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని, వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కోరారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికతలో కూడా కలిసి పనిచేయాలన్ని ఆకాంక్షను ఆయన వెలిబుచ్చారు.



## తెల్లవారక ముందే

# మద్యం అమ్మకాలు

మహబూబ్ నగర్, తెలంగాణ దిశ : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తెల్లవారక ముందే జోరుగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ ఉదా సీనతకు ఎక్సైజ్ శాఖ అధికారులకు మాముళ్లు అందుతున్నాయనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగానే ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా మద్యం అమ్మకాలు సాగిస్తూ, సమయ వేళలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, మేలచెర్వుచౌరస్తా, జమ్మిచేడు , రాఘవేంద్ర కాలనీలో మొత్తం జిల్లా కేంద్రంలో 8 వైన్ షాపులున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు చేపట్టాలి. కాని కొత్తబస్టాండ్, ఓల్డ్ వెజిటేబుల్ మార్కెట్, మేలచెర్వు వైన్ షాపుల పక్కన ఉన్న ఫర్మిట్‌రూమ్ ల్లో నిర్వాహకుల కన్ను సన్నలో మందుబాబులకు తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు.



## ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి

## తెలంగాణ హైకోర్టులో

# చుక్కెదురు

హైదరాబాద్, తెలంగాణ దిశ : ఐఏఎస్ అధికారి శ్రీల క్ష్మికి తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఆమె ఉన్నత న్యాయస్థానంలో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మిని న్యాయస్థానం ఇప్పటికే నిందితురాలిగా తేల్చింది. కోర్టు తీర్పుతో ఆమె పాత్రపై సీబీఐ విచారణ జరపనుంది. ఓబుళాపు రం మైనింగ్ కేసులో వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను 2022 అక్టోబరులో సీబీఐ కోర్టు కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె తెలంగాణ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. గతంలో దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం.. శ్రీలక్ష్మి పిటిషన్‌ను అనుమతించింది. ఆమెను కేసు నుంచి తప్పిస్తూ తీర్పు వెలువరించింది.


అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న
చైన్ మెన్ బాలరాజు..
కాప్రా సర్కిల్ లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు
వసూళ్ల దందాలో చైన్ మెన్లు..
తెలంగాణ దిశ

# తెలంగాణ దిశా ఎఫెక్ట్...

## కాప్రా టౌన్ ప్లానింగ్

# చైన్ మెన్లు బదిలీ



# “అవినీతిలో రారాజు ఈ బాలరాజు”

**కాప్రా, జూలై 25, (తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం లోని చైన్ మెన్లు బదిలీ అయ్యారు. స్థానికంగా అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారని “తెలంగాణ దిశ”లో అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న చైన్ మెన్ బాలరాజు”... “కాప్రా సర్కిల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు...., వసూళ్ల దందాలో చైన్ మెన్లు” అనే శీర్షికలతో ఈ నెల 17న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో కాప్రాలో పనిచేస్తున్న ముగ్గురు చైన్ మెన్లను బదిలీ చేస్తూ జిహెచ్ఎంసి ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. కాప్రాలో పనిచేస్తున్న పి. గంగాధర్ ను హయత్ నగర్ సర్కిల్ కు బదిలీ చేశారు. అదే విధంగా ఎస్. వెంకటేష్ ను ఎల్ బి నగర్ సర్కిల్ కు బదిలీ చేయగా ఎ. బాలరాజును ఉప్పల్ సర్కిల్ కు బదిలీ చేశారు. వీరి స్థానంలో డి. మహేందర్, ఎం. శ్రీనివాస్, డి. జ్ఞానేశ్వర్లను కాప్రాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### అవినీతిలో బాలరాజు రికార్డు

కాప్రా సర్కిల్ చైన్ మెన్ గా బాధ్యతలు స్వీకరించిన కేవలం ఎనిమిది నెలలలోనే బాలరాజు అవినీతి రారాజుగా పేరు తెచ్చుకున్నారు. గత 8 నెలలుగా కాప్రాలో ఏసిపి తోపాటు టిపిఎస్ లు అందుబాటులో లేకపోవడం వల్ల బాలరాజు మొత్తం తానే అయి వ్యవహరించారని ఆరోపణలు వినిపించాయి. అధికారుల పర్యవేక్షణ




లేకపోవడం కారణంగా విచ్చలవిడిగా అదనపు అంతస్తులు, పెంట్ హౌస్ లు, అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొత్తగా వచ్చిన న్యాక్ ఇంజనీర్లకు సరైన అవగాహన లేకపోవడం కూడా అతనికి కలిసి వచ్చింది. సర్కిల్ లోని ఒక అధికారి ప్రోత్సాహంతోనే ఈ తతంగమంతా నడిచినట్లు సర్కిల్ ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారూ లేదో వేచి చూడాల్సిందే.

### కాప్రాలో పడకేసిన పాలన

జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో పాలన పూర్తిగా పడకేసింది. ఒకప్పుడు ఉత్తమ సర్కిల్ గా ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్న కాప్రా ప్రస్తుతం దీనస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సర్కిల్లోని వివిధ విభాగాల అధికారులపై ఎవ్వరికి పట్టు లేకుండా పోయింది. ఉద్యోగులు కార్యాలయానికి సమయానికి రావడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫీల్డ్ మీద తిరుగుతున్నామన్న పేరుతో విధులకు ఎగనామం పెడుతున్నారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారికి సరైన సమాధానం చెప్పేవారు కరువవుతున్నారు. కనీసం ఆస్తిపన్ను చెల్లింపుకు వచ్చేవారికి సైతం కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ముఖ్యంగా అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాప్రాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ కల్పించుకొని కాప్రాలో పాలన వ్యవస్థను చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

---

శ్రావణ మాసం వివాహాలకు, విహారయాత్రలకు

# ప్రత్యేక ఆర్టీసీ బస్సులు..

### డిపాజిట్ లేకుండా తక్కువ చార్జీలతో




**కుషాయిగూడ, జూలై 25, (తెలంగాణ దిశ):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పెళ్లిలు, శుభకార్యాల సందర్భంగా రాకపోకలకు మరింతగా అనుకూలంగా ఉండేందుకు, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచినట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ బస్సులకు ఎటువంటి డిపాజిట్ లేకుండా, అతి తక్కువ ఛార్జీలతో బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ యాజమాన్యం ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. అదే విధంగా ఆర్టీసీ పుణ్య యాత్రలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భక్తులు కనీస ఖర్చుతో భద్రతతో యాత్రలు పూర్తి చేయవచ్చునన్నారు. ఈ ప్యాకేజీలలో శ్రీశైలం, నాగార్జునసాగర్, తిరుపతి, అరుణాచలం, అనంతగిరి వంటి ప్రదేశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ప్రత్యేకంగా ప్రయాణికుల అభిప్రాయాలను స్వీకరించే కార్యక్రమంగా “డైల్ యువర్ డీఎం” కార్యక్రమం ఈ శనివారం (రేపు) ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఈ సమయంలో ప్రయాణికులు తమ సూచనలు, ఫిర్యాదులు, అభిప్రాయాలను సంబంధిత డిపో మేనేజర్ తో నేరుగా, ఫోన్ ద్వారా 99592 26145 పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఆర్టీసీ సేవా నాణ్యతను మరింత మెరుగు పరచాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మిగిలిన వివరాలకు 96035 49388 సెల్ నెంబర్ లో సంప్రదించవచ్చు.

# చోరీలకు పాల్పడుతున్న యువతి అరెస్ట్..

## 22.3 తులాల బంగారం, 5 తులాల వెండి స్వాధీనం




**కుత్బుల్లాపూర్, జూలై 25, (తెలంగాణ దిశ) :** వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న యువతిని బాలానగర్ పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బాలనగర్ డిసిపి సురేష్ కుమార్ షాపూర్ నగర్ లోని కార్యాలయంలో శుక్రవారం పత్రిక విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అమీర్ పేట్ మధురా నగర్ లో నివసించే బేబీ అలియాస్ ఆరోహి (21) గత కొంత కాలంగా చోరీలకు పాల్పడుతూ దొంగలించిన సొత్తుతో జల్సాలు చేస్తుంది. గతంలో బోరబండలో రెండు ఇళ్లల్లో చోరీలు చేసి పోలీసులకు దొరకకుండా తప్పించుకుంది. ఈనెల 18న బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో భారీ చోరీకి పాల్పడింది. ఆరోజున అదే కాలనీలో నాలుగు ఇళ్ళను రెక్కీ చేసి చోరీకి ఒక ఇంటిని మాత్రం అనుకూలంగా ఉన్నట్లు గుర్తించింది. ఆ ఇంట్లో ఎవరూ లేకుండా ఉండడం ఇంటికి తాళం కల్పించడంతో నిందితురాలు ఆ ఇంటి ముందు ఉన్న చెప్పుల స్టాండ్ లో ఇంటి తాళాలు ఉండవచ్చని భావించి వెతికింది. ఆమె అనుకున్నట్లే ఇంటి తాళాలు చెప్పుల స్టాండ్ లో కనిపించాయి. దీంతో ఇంటి తాళం ఓపెన్ చేసి ఇంట్లోకి వెళ్లి 23 తులాల బంగారం నగలను, ఐదు తులాల వెండిని చోరీ చేసి యధావిధిగా ఇంటి తాళం చెవులు అదే చెప్పుల స్టాండ్ లో భద్రపరిచి పారిపోయింది. ఇంటి యంజమాని తన పిల్లలను స్కూల్ నుండి తీసుకురావడానికి హడావుడిగా వెళుతూ ఇంటి తాళాలను చెప్పుల స్టాండ్ లో పెట్టి వెళ్ళాడు. తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా 23 తులాల బంగారం, ఐదు తులాల వెండి కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్న ఆ యజమాని బాలనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. బాలానగర్ పోలీసులు, బాలానగర్ సెంట్రల్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా జరిగిన చోరీ విషయమై దర్యాప్తును వేగవంతం చేసి ఎట్టకేలకు చోరీచేసిన నిందితురాలిని పట్టుకున్నారు. ఆమె నుండి 22.3 తులాల బంగారాన్ని, ఐదు తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలైన బేబీ అలియాస్ ఆరోహిని రిమాండ్ కు తరలించారు. నిందితురాలు గత కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసిపి పి. నరేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట సిఐ నరసింహారావు, డిఐ నరేందర్ రెడ్డి, బాలనగర్ సిసిఎస్ ఇన్ స్పెక్టర్ రవి, క్రైమ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



---

అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ ను

# సద్వినియోగం చేసుకోవాలి





**కుత్బుల్లాపూర్, జూలై 25, (తెలంగాణ దిశ) :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మహమ్మద్ అమీరుద్దీన్ కు రూ. 2. 25 లక్షలు, లక్ష్మమ్మకు రూ. రెండు లక్షల విలువ గల ఎల్ఓసిలను శుక్రవారం చింతల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయా డివిజన్ లకు చెందిన బిఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. గాజుల రామారం ప్రాంతానికి చెందిన మహమ్మద్ అమీరుద్దీన్ తండ్రి మహమ్మద్ బషీరుద్దీన్ (57), జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్ కి చెందిన లక్ష్మమ్మ కేరాఫ్ నాగరాజు (72) లు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకులు మక్సూద్ అలీ, ప్రవీణ్ ల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ వెంటనే స్పందించి వారికి ఎల్ఓసిలను మంజూరు చేయించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేక మెరుగైన చికిత్స కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్క నిరుపేద లబ్ధిదారులు ఈ ఎల్ఓసి సదుపాయాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, సంపత్ మాధవ రెడ్డి,సుధాకర్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, నవీన్, శివ నాయక్, ప్రసాద్, బి. రాధా భాయ్, డి. దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్ల పంపిణీ

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఏఎస్ రావునగర్, జూలై 25, (తెలంగాణ దిశ) :** డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని గ్రౌండ్ లో స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. వారు చేసే సేవకు ఎంత పారితోషికం ఇచ్చిన తక్కువేనని, శానిటేషన్ సిబ్బంది ఒక్క రోజు లేకున్న హైదరాబాద్ హస్త వ్యస్తమవుతుందని అన్నారు. వారితో ప్రతి ఒక్కరు కూడా గౌరవంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమ శేఖర్ రెడ్డి, శానిటేషన్ సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పశ్చిమాసియాను నిప్పుల కొలిమిగా మార్చిన ఇజ్రాయిల్

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధానికి అక్టోబరు 7వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. హమాస్ దాడిని ఒక సాకుగా చూపించి ఇజ్రాయిల్ గాజాపై మానవ మారణహోమం ప్రారంభించింది. హమాస్‌ను నిర్మూలించేందుకే తాను గాజాపై దాడి చేస్తున్నానని చెప్పింది. ఆ లక్ష్యం సాధించడం అటుంచి ఇజ్రాయిల్ ఈ రోజుకు వచ్చేసరికి మొత్తం పశ్చిమాసియాను నిప్పుల కొలిమిగా మార్చింది. లెబనాన్, ఇరాన్, సిరియా, ఎమెన్, ఇరాక్‌లపై దాడికి ఒడిగడుతున్నది. ఇజ్రాయిల్ దురాక్రమణలో భాగంగా వేసే ప్రతి అడుగునూ బలపరుస్తూ అమెరికా గట్టిగా వత్తాసుదారుగా నిలిచింది. గత పక్షం రోజులలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న సైనిక దాడులు యుద్ధం స్వభావాన్నే మార్చేశాయి. ఒక పథకం ప్రకారం మొదలుపెట్టిన దాడిలో అది దక్షిణ లెబనాన్‌పై ముమ్మర వైమానిక దాడులకు దిగింది. పేజర్లు ఇతర సమాచార సాధనాలను ఉపయోగించి హిజ్బుల్లా నాయకుల హత్యలకు పాల్పడింది. సంస్థ కేంద్రంలో వున్న హిజ్బుల్లా ప్రధాన కార్యదర్శి హసన్ నస్రుల్లాను ఒక బంకర్ విధ్వంసక బాంబర్‌తో హత్య చేయడంతో యుద్ధం మరింత తీవ్రమైంది. దక్షిణ లెబనాన్‌పై ఒక పరిమిత స్థానిక లక్ష్య నిర్దేశిత భూతల యుద్ధం ప్రారంభిస్తున్నట్టు ఇజ్రాయిల్ అక్టోబర్ ఒకటిన ప్రకటించింది. అయితే వాస్తవంలో అది పూర్తి స్థాయి భూతల యుద్ధం కోసం లెబనాన్ సరిహద్దులలో భారీ సంఖ్యలో బలగాలను మోహరించింది. ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో ఒక దుష్ట రాజ్యం. అన్ని అంతర్జాతీయ చట్టాలనూ, ఒప్పందాలనూ ఉల్లంఘించి అది దేశ దేశాలలో పథకం ప్రకారం హత్యలు, దాడులు సాగిస్తున్నది. గత ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ ఇరానియన్ భూభాగంపై వైమానిక దాడులకు పాల్పడ్డం ద్వారా హమాస్ ప్రధాన ప్రతినిధి ఇస్మాయిల్ హనియే ప్రాణాలు తీసింది. నూతనంగా ఎన్నికైన ఇరాన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు వెళ్లిన హనియేను బలిగొన్న తర్వాత అది బీరుట్‌ను లక్ష్యంగా చేసుకుని నస్రుల్లాను హతమార్చింది. నస్రుల్లా హత్య తర్వాత హిజ్బుల్లా దాదాపు తుడిచి పెట్టుకు పోయినట్లేనని ఇజ్రాయిల్ ప్రకటించింది. అలాంటి దారుణమైన హూంకరింపులు వాస్తవానికి చాలా దూరంగా వుంటాయి. 1992లో ఇజ్రాయిల్ హిజ్బుల్లా సహ వ్యవస్థాపకుడు, రెండవ కార్యదర్శి అబ్బాస్ అల్ ముసావీని హత్య చేసినట్టు ప్రకటించింది. ఆ స్థానంలో నస్రుల్లా వచ్చాడు. తను రెండు సార్లు ఇజ్రాయిల్ సైన్యం దురాక్రమణను ప్రతిఘటించాడు. హిజ్బుల్లా చేతుల్లో రెండుసార్లు పరాజయం పాలైన తర్వాత 2006లో ఇజ్రాయిల్ తను అనుకున్న లక్ష్యం సాధించలేక పోయినట్టు అంగీకరించాల్సి వచ్చింది. ఇదివరకటి తన దుస్సాహసాలకు ఏ గతి పట్టిందో ఇజ్రాయిల్ మరచి పోయినట్టు కనిపిస్తుంది. పశ్చిమాసియాలో అమెరికాకు బలమైన స్థావరంగా వున్న ఇజ్రాయిల్ అమెరికా భాషనే మాట్లాడుతున్నది. 'ఉధృతం నుంచి ఉపశమనం' అంటూ అది తన సైనిక వ్యూహాన్ని ప్రకటించింది. ఇదో లోపభూయిష్టమైన అవగాహన, విఫల వ్యూహం. ఉధృత సైనిక దాడితో శత్రువు లొంగిపోవలసి వస్తుందనేది ఈ వ్యూహంలో వుండే ఆలోచన. అయితే ఈ వ్యూహం ప్రకారమే విజయాలు దక్కుతాయనే గ్యారంటీ ఏమీ లేదని చెప్పడానికి చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా లిబియాలలో అమెరికా దారుణంగా ఓడిపోవడం చూశాం, ఇప్పుడూ ఇజ్రాయిల్‌కు అదే గతి పట్టబోతున్నది. హిజ్బుల్లా దళాలు తమ దాడులతో నిస్సహాయ స్థితిలో పడిపోయాయనీ, కనుక ఇరాన్ కూడా ఆ ప్రభావానికి గురై బలహీనంగా మారిందని యుద్ధోన్మాద ఇజ్రాయిల్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌పై సైనిక దాడులు జరగాలని, ఆ దేశ అణు కేంద్రాలనూ లక్ష్యంగా చేసుకోవాలనీ చెబుతున్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావడం గురంచీ, పశ్చిమాసియా రాజకీయ ముఖచిత్రం మార్పు గురించీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాట్లాడుతున్నారు. ఈ విశృంఖల భావాలతో రెచ్చిపోయిన ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో తన ఆధిపత్యం నెలకొల్పుకోవాలని నిర్యక్ష్యపూరితంగా ప్రయత్నిస్తోంది. అది అమెరికా ప్రయోజనాలకూ ఉపయోగకరమవుతుంది. ఇజ్రాయిల్‌ను నిలవరించడానికి తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఇరాన్ ఇప్పుడు ఆ దేశంపై 180కి పైగా మిసైళ్లను ప్రయోగించింది. తమ గగనతలంపై ఇజ్రాయిల్ దాడి చేశాక ఇరాన్ ప్రతీకార దాడి చేయడం ఇది రెండోసారి. అమెరికా నుంచి, దాని మిత్ర దేశమైన బ్రిటన్ వంటి దేశాల నుంచి తిరుగులేని మద్దతు వల్లనే ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ధైర్యం వస్తున్నది. ఈ సంఘర్షణ ప్రతి దశలోనూ అమెరికా నుంచి ఇజ్రాయిల్‌కు మద్దతు లభిస్తూనే వుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మరే దేశానికీ ఇవ్వనంతగా 12,400 కోట్ల డాలర్ల సహాయం అందించింది. 2016 నుంచి చూస్తే దశాబ్ది సహాయం పథకంలో భాగంగా ఇజ్రాయిల్ ఏటా మొత్తం 3800 కోట్ల డాలర్ల సహాయం అందుకున్నది. గాజాపై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిన రోజున అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరింత సైనిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. పేలుడు పదార్థాలు, విధ్వంసక పరికరాలు అందించి ఇజ్రాయిల్ ఉక్కు చట్రాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇజ్రాయిల్ రక్షణ బలగాలు మానవ హక్కుల హననానికి పాల్పడుతున్నారని వస్తున్న నివేదికలను బొత్తిగా పెడచెవిన పెట్టి అమెరికా ఆగష్టులో ఇజ్రాయిల్‌కు తమ దేశ సైనిక పరిరకాలను, ఆయుధాలను కొనుగోలు చేయడం కోసం 3500 కోట్ల డాలర్ల అదనపు సహాయం పంపించింది. గత ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ ఆయుధ పాటవం పెంపు కోసం 1400 కోట్ల డాలర్ల సాయం లభించింది. వీటన్నిటినీ మించి అమెరికా ఇజ్రాయిల్‌కు మద్దతుగా యుద్ధ విమానాలు, క్షిపణి విధ్వంసక ఆయుధాలు తరలించింది. ఇరాన్ మిసైళ్లను తిప్పికొట్టడంలో తమ సైన్యం కీలకమైన వ్యూహాత్మక పాత్ర పోషించిందని అమెరికా ప్రకటించింది. బ్రిటన్ కూడా అలాంటి ప్రకటనే చేసింది. ఇజ్రాయిల్‌కు అమెరికా ఇన్ని విధాల ఆర్థిక, ఆయుధ సహాయం అందిస్తుంటే కాల్పుల విరమణకూ యుద్ధ ప్రజ్వలన చల్లార్చడానికి ప్రయత్నిస్తున్నాని మాట్లాడటం కేవలం కంటి తుడుపు, పసలేని పల్లవి మాత్రమే. పాలస్తీనాతో సంఘీభావం అనే విధానం నుంచి వైదొలగిన భారత ప్రభుత్వం అమెరికాకు, ఇజ్రాయిల్‌కు కూడా వ్యూహాత్మక భాగస్వామిగా వుంది. 12 నెలల్లోగా అన్ని ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలగాలని ఇజ్రాయిల్‌ను ఆదేశిస్తూ ఐక్యరాజ్యసమితి ముందుకొచ్చిన తీర్మానంపై ఓటింగులో పాల్గొనకుండా వుండిపోయింది.

# మల్లంపేట్ ప్రధాన రహదారి సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, జూలై 25, (తెలంగాణ దిశ) :** మల్లంపేట్ ప్రధాన రహదారి సిసి రోడ్డును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. గత నెల రోజుల క్రితం ఈ రోడ్డు చిన్నాభిన్నం కావడం వల్ల పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులను సంప్రదించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయించారు.
దీంతో కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పద్మారావు, సీనియర్ నాయకులు ప్రకాశ్ రావు, జి. మల్లేష్,
జి. శ్రీను, హరివర్ధన్ రావు, రేవంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కోలన్ మనోజ్ రెడ్డి, కె.రాకేష్, అంజయ్య గౌడ్, ప్రభాకర్, నవీన్, వంశీ కృష్ణ, ఎండి తారే, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎందరికో రుణం.. కొందరికే మాఫీ?

**కరీంనగర్,, తెలంగాణ దిశ :** కాంగ్రెస్ అమలు చేస్తున్న రుణమాఫీ జాబితాల్లో మెజార్టీ రైతుల పేర్లు గల్లంతయ్యాయి. పదులు, వందల సంఖ్యలోనే కాదు, ఏకంగా ఊళ్లకు ఊళ్లే జాబితాల నుంచి కనుమరుగయ్యాయి. రుణం తీసుకున్న వారిలో 40 శాతం మందికి కూడా మాఫీ వర్తించలేదు. కొన్ని చోట్లయితే కనీసం ఒక్కరికీ అమలు కాలేదు. జగిత్యాల జిల్లా ఇండియన్ బ్యాంక్ ఐదు శాఖల పరిధిలో చూస్తే వేలాది మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. ఒక్కో బ్రాంచ్ పరిధిలో కనీసం ఐదు నుంచి ఏడు గ్రామాల రైతులు పంట రుణాలు తీసుకున్నా పెద్ద సంఖ్యలో రైతులకు వర్తించలేదు. మొదటి దఫా ఐదు బ్రాంచ్‌ల పరిధిలో కేవలం ఒక్క రైతుకు మాత్రమే రుణమాఫీ జరిగింది. రెండో దఫా 1500 మందికి మాఫీ అయినట్టు జాబితా వచ్చింది. రాయికల్ మండలం మైతాపూర్‌లోనే మెజార్టీ రైతుల పేర్లు జాబితాల్లో కనిపించలేదు. ఒక్క ఇండియన్ బ్యాంకే కాక, జిల్లాలో రెండు శాఖలతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోనూ ఇదే దుస్థితి. 228 రుణం తీసుకోగా, అందులో కేవలం ఇద్దరికే మాఫీ జరిగింది. ఇక రెండో దఫా ఏ మేరకు జరిగిందన్న విషయం తెలియడం లేదు. సింగిల్ విండోల్లో మాఫీ పొందిన వారిలోనూ పెద్ద సంఖ్యలో పేర్లు గల్లంతు కాగా, వాటిని సైతం ఈ జాబితాలో సరిచేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఇటు కరీంనగర్ జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది. కొత్తపల్లి మండలం బావుపేటలోని ఇండియన్ బ్యాంక్ పరిధిలో లోన్ తీసుకున్న 700 మందిలో మొదటి విడుత కేవలం ఏడుగురికే మాఫీ జరిగింది. శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంకు పరిధిలో 14గ్రామాలకు చెందిన 640 మంది లోన్ తీసుకుంటే ఒకరిద్దరికి మాత్రమే మాఫీ అయింది. వేలాది మంది పేర్లు జాబితాలో గల్లంతు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తమవుతున్నది. మొదటి, రెండో జాబితాల్లో ఎక్కువ సంఖ్యలో



పేర్లు గల్లంతు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు పరిధిలో వేలాది మంది పేర్లు లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక అటు వ్యవసాయ అధికారులు,
ఇటు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడికి వెళ్లినా వారికి సరైన సమాధానం రాక అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీ జాబితాలో లేని వారి పేర్లను రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన బుక్‌లో రాయించుకోవాలని అధికారులు చెప్పగా అక్కడికి వెళ్తే రాసుకునే వారు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మొన్నటిదాకా అధికారులు రెండో విడుత పేరు చెప్పి దాటేశారని.. ఇప్పుడు రెండో విడుతలో కూడా పేర్లు లేవని, దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. కాగా జగిత్యాల డీఏవో వాణి మాట్లాడుతూ, రుణమాఫీ కాని రైతులు వివరాలు అందిస్తే ముప్పై రోజుల వ్యవధిలో వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

# ఆగని బియ్యం దందా..?

**కుమ్రంభీం, తెలంగాణ దిశ :** జిల్లాలో దాడులు జరుగుతున్నా రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదు.పతి నెలా ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది. బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి పట్టుకున్న అధికారులు ఇటీవల అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడంతో అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాగా మారింది. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్–టీ మీదుగా చౌక బియ్యం పొరుగుకు రాష్ట్రానికి రవాణా అవుతున్నది. ఈ దందా ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం నుంచి మొదలవుతున్నది. కొంతమంది వ్యాపారులు ప్రత్యేకంగా రేషన్ బియ్యం కొని పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. స్థానిక అధికారుల అండదండలు, రాజకీయ నాయకుల సహాయ సహకారాలతోనే బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతున్నదనే అను మానాలు కలుగుతున్నాయి. బియ్యం రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారిపై కేసులు నమోదవుతున్నప్పటికీ అక్రమ బియ్యం దందా మాత్రం ఆగడం లేదు. అక్రమార్కులు వివిధ మార్గాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది. బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి పట్టుకున్న అధికారులు ఇటీవల అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడంతో అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాగా మారింది. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్–టీ మీదుగా చౌక బియ్యం పొరుగుకు రాష్ట్రానికి రవాణా అవుతున్నది. ఈ దందా ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం నుంచి మొదలవుతున్నది. కొంతమంది వ్యాపారులు ప్రత్యేకంగా రేషన్ బియ్యం కొని వాటిని విక్రయించడమే వృత్తిగా పెట్టున్నారు. కొన్ని ప్రాం తాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ షాపు వద్దనే కొనడం, మరి కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇవ్వకుండానే నేరుగా రేష న్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వ స్తున్నాయి. కిలో బియ్యాన్ని రూ.12కు కొనుగోలు చేసి మ హారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాల్లో రూ.20కు వరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రకు తరలి వెళ్తున్న బియ్యాన్ని పట్టుకునేందుకు మధ్యలో ఎక్కడ చెక్‌పోస్టులు లేవు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వ్యాన్‌లలో జిల్లాలో వాంకిడి, సిర్పూర్–టీ మండలంలోని వెంట్రావ్‌పేట్, తదితర మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ గోదాముల్లో డంప్ చేసి, అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొందియా, బల్లార్షలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తూ కేసులు పెడుతున్నా ఎలాంటి భయం లేకుండా అక్రమార్కు లు దందాను కొనసాగిస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు పెంచికల్‌పేట్‌లో ఓ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి రవాణాకు సిద్ధంగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.

# విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేశాం..



**రామగిరి, తెలంగాణ దిశ :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేశామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని రత్నాపూర్‌లో 4.16లక్షలతో విద్యుత్ ఉపకేంద్రం, పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో రూ. 3.5 లక్షలతో నిర్మాణం చేపట్టిన కస్తూర్బా నూతన భవనాలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం మంవత్రి మట్లాడారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సింగరేణి సహకారంతో నాలుగు కోట్ల 16లక్షలతో నిర్మాణం చేసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కంటే అధిక స్థాయిలో అవసరం ఏర్పడుతున్న క్రమంలో రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాలతో పాటు గ్రిడ్ నుంచి సైతం విద్యుత్ కొనుగోలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. చిన్నపాటి సాంకేతిక సమస్యల వల్ల కలిగే విద్యుత్ అంతరాయాలను సైతం ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. రత్నాపూర్ గ్రామంలో నెలకొనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావద్దనే ఉద్దేశంతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మరో తొమ్మిది సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. గ్రామానికి చెందిన మహిళలు మరిన్ని ప్రతిపాదనలు చేశారని వాటిపై సైతం దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపుకలెక్టర్ అరుణ, ఆర్డీవో హనుమానాయక్, పెద్దపల్లి విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సుదర్శన్, డీఈవో మాధవి, మంథని డీఈ ఈశ్వర్‌ప్రసాద్, ఏఈ మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని సెంటినరీకాలనీ మేకల మార్కెట్‌లోని శ్రీరామాంజనేయ స్వామి, ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలోని త్రయంబకేశ్వర ఆలయాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజాల్లో పాల్గొన్నారు. 101 కొబ్బరికాయాలను కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలోని సిబ్బంది మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

# పుష్కలంగా ఇథనాల్..




వరంగల్, తెలంగాణ దిశ : చాలామంది తెల్ల, పచ్చ జొన్నలు తమ ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆహారంలో భాగం చేసుకుంటారు. ప్రస్తుతం దేశంలో మరో రకం జొన్న పంట సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధలు చేస్తున్నారు. అయితే తియ్యగా ఉండే ఈ రకం జొన్న తినడానికి ఉపయోగించరు. ఇందులో ఇథనాల్ ఎక్కువగా లభిస్తుంది. దీన్ని పెట్రోల్‌లో కలిపేందుకు వినియోగిస్తున్నారు. పెట్రోల్ దిగుమతిని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించేందుకు పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 12 శాతం ఇథనాల్ మాత్రమే పెట్రోల్‌లో కలుపుతున్నారు. ఇప్పటిదాకా.. చెరకు నుంచి తీసిన ఇథనాల్‌ను మాత్రమే వాడుతున్నారు. చెరకు విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. అందుకే ఇథనాల్ ఉత్పత్తి కోసం శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృషి సారించారు. తియ్యటి జొన్న పంటలో ఇథనాల్ పుష్కలంగా లభిస్తుందని గుర్తించి.. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) తోడ్పాటుతో దీనిని ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఐకార్‌కు అనుబంధంగా పనిచేసే హైదరాబాద్‌లో ఉన్న భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ.. దేశంలో తియ్యటి జొన్న విత్తనోత్పత్తి కోసం సాగు చేస్తోంది.ఇందులో భాగంగానే వరంగల్ రీజియనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ లో కూడా రెండెకరాల్లో 'జైకార్ రసీలా' అనే రకం జొన్నను సాగు చేశారు. ఇప్పుడు అది కోతకు వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ పంట సాగుకు ఐఐఎంఆర్ శాస్త్రవేత్త డా.ఏవీ ఉమకాంత్ నేతృత్వం వహిస్తున్నారు. ఆయన తన బృందంతో కలిసి బుధవారం వరంగల్‌లో సాగైన ఈ జొన్న పంటను పరిశీలించారు.మరో విషయం ఏంటంటే.. ఈ తియ్యటి జొన్న నుంచి ఇథనాల్‌ను బయటికి తీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి యంత్రాలు అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం చెరకు పరిశ్రమల్లో వినియోగిస్తున్న యంత్రాలను వీటికి ఉపయోగించవచ్చని అన్నారు.

# బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలి

**కాగజ్‌నగర్, తెలంగాణ దిశ:** ప్రభుత్వ దవాఖానలో రోగులకు బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట ప్రాంతంలోని సామాజిక 30 పడకల ప్రభుత్వ దవాఖానను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్, రక్త నిల్వలు, రిజిష్టర్లు, మందుల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన ఎదుట బురదమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ డీఈ రమాదేవిని ఆదేశించారు. సిర్పూర్(టీ), బెజ్జూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలందించేలా తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలోని బసంత్‌నగర్‌లో కడక్ నాథ్ అమిత్ మండల్ కోళ్ల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. మహిళా శక్తి కింద చేపట్టనున్న కోళ్ల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. మహిళా శక్తి పథకం కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హులకు కోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెనూ ప్రకారం పోషకాహారం సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాసర్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పౌష్టికాహారం అవసరమైన మందులను అందించడంపై యూనిసెఫ్ ప్రతినిధులు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, ఆహార విభాగం సమన్వయకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామని, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో అనారోగ్యంతో విద్యార్థిని మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థిని కుమ్రం లక్ష్మి కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం జ్వరంతో మృతి చెందిందని



ఆరోపించారు. పది రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతుంటే అకడ పని చేస్తున్న సిబ్బంది పారాసిటమల్ గోలీలు ఇచ్చి సరిపెట్టారని, మెరుగైన వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిని ఇంటికి పంపించాలని తల్లిదండ్రులు కోరినా పంపించలేదన్నా రు. విద్యార్థిని ఆరోగ్యం విషమించిన తర్వాత తల్లిదండ్రులకు అప్పాజెప్పా రని, అదే రోజు రాత్రి విద్యార్థిని ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని తెలిపారు. విద్యార్థిని మృతికి కారణమైన ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎం, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



## బూడిద గుమ్మడికాయలను అంత తేలిగ్గా

# తీసిపారేయకండి..

### వీటితో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!

గుమ్మడికాయల్లో మనకు రెండు రకాల కాయలు అందుబాటులో ఉంటాయన్న విషయం విదితమే. సాధారణ గుమ్మడికాయలను అందరూ తింటారు. కానీ బూడిద గుమ్మడికాయలను మాత్రం కేవలం దిష్టి తీయడానికి లేదా గుమ్మం వద్ద దిష్టి తగలకుండా కట్టేందుకు మాత్రమే ఉపయోగిస్తారు. వాస్తవానికి బూడిద గుమ్మడికాయ కూడా మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. బూడిద గుమ్మడికాయతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగితే అనేక లాభాలు కలుగుతాయని వారు అంటున్నారు. అలాగే దీంతో వంటకాలను కూడా చేసి తినవచ్చు. 100 గ్రాముల బూడిద గుమ్మడికాయను తింటే అందులో 96 శాతం నీరే ఉంటుంది. 17 క్యాలరీల శక్తి మాత్రమే లభిస్తుంది. 4 గ్రాముల పిండి పదార్థాలు, 3 గ్రాముల ఫైబర్, 1 గ్రాము ప్రోటీన్లు ఉంటాయి. అలాగే వీటిలో విటమిన్లు సి, బి1, బి2, బి3, బి5, బి6లతోపాటు క్యాల్షియం, ఐరన్, పొటాషియం, ఫాస్ఫరస్, మెగ్నిషియం, జింక్, మాంగనీస్ అధికంగా ఉంటాయి.


**బరువు తగ్గేందుకు..:** బూడిద గుమ్మడికాయల్లో 96 శాతం మేర నీరే ఉంటుంది కనుక ఈ కాయలను తిన్నా లేదా జ్యూస్‌ను తాగినా శరీరానికి చల్లదనం లభిస్తుంది. శరీరంలో ఉండే వేడి పోతుంది. శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ సమస్య రాకుండా ఉంటుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యంలో ఉంటాయి. దీంతో శరీరం యాక్టివ్‌గా, చురుగ్గా ఉంటుంది. బూడిద గుమ్మడికాయలతో మనకు చాలా తక్కువ క్యాలరీలు లభిస్తాయి. పైగా ఫైబర్ ఉంటుంది కనుక దీన్ని తిన్నా లేదా జ్యూస్‌ను తాగినా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువు సమస్యతో ఇబ్బంది పడుతున్నవారు బూడిద గుమ్మడికాయను తింటుండాలి. దీంతో బరువును తగ్గించుకోవచ్చు. బరువు నియంత్రణలో ఉంటుంది.

**జీర్ణ వ్యవస్థకు..:** బూడిద గుమ్మడికాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఈ కాయలను తింటే కడుపు ఉబ్బరం తగ్గుతుంది. ఈ కాయలు సహజసిద్ధమైన ఆల్కలైన్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల శరీరం లేదా జీర్ణాశయంలో అధికంగా ఉండే ఆమ్లాలను బయటకు పంపుతాయి. బూడిద గుమ్మడికాయలు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. ఈ కాయలను తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సంబంధ సమస్యలు రాకుండా చూస్తుంది. ఈ కాయలను తింటే అనేక రకాల బి విటమిన్లు లభిస్తాయి. ఇవి మన శరీరానికి శక్తి నిరంతరం అందేలా చూస్తాయి. దీంతో శరీరం చురుగ్గా ఉంటుంది. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. తీవ్రమైన అలసట, నీరసం సైతం తగ్గిపోతాయి.

**మానసిక ఆరోగ్యానికి..:** బూడిద గుమ్మడికాయ మెదడుపై రిలాక్స్ ఫీలింగ్ ను కలగజేస్తుంది. అందువల్ల ఈ కాయలను తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఈ కాయలను తింటే శరీరంలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. లివర్, కిడ్నీలు డిటాక్స్ అవుతాయి. ఆయా భాగాల్లో ఉండే వ్యర్థాలను శరీరం సులభంగా బయటకు పంపుతుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. ఇలా బూడిద గుమ్మడికాయలతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక ఈ కాయలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

# పొట్టలో అసౌకర్యంగా ఉండి విరేచనాలు అవుతున్నాయా..?

## ఈ చిట్కాలను పాటించండి..!



వర్షాకాలంలో సహజంగానే మనకు జీర్ణ సమస్యలు అధికంగా వస్తుంటాయి. ఇందుకు అనేకే కారణాలు ఉంటాయి. ఎక్కువగా కలుషిత ఆహారం తినడం లేదా నీళ్లను తాగడం వల్ల మనకు పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కొందరికి విరేచనాలు ఎడతెరిపి లేకుండా అవుతూనే ఉంటాయి. అయితే ఇందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన వంట ఇంట్లో ఉండే పదార్థాలతోనే అత్యంత సహజసిద్ధంగా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఈ పదార్థాలను ఉపయోగిస్తే పొట్టలో ఏర్పడే అసౌకర్యం తొలగిపోవడమే కాదు విరేచనాలు కూడా ఆగిపోతాయి. అలాగే ఇతర జీర్ణ సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

అల్లం..: అల్లంలో యాంటీఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణాశయ గోడలను ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి. దీంతో పొట్టలో ఏర్పడే అసౌకర్యం తగ్గిపోతుంది. అలాగే వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. అల్లాన్ని తీసుకుంటే జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి.

దీంతో జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. చిన్న అల్లం ముక్కను 2కప్పుల నీటిలో వేసి ఒక కప్పు నీరు అయ్యేవరకు మరిగించాలి. అనంతరం ఆనీళ్లను వడకట్టి గోరు వెచ్చగా ఉండగానే అందులోకాస్త తేనె కలిపి తాగేయాలి. ఇలా రోజుకు 2 సార్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. అలాగే చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని నేరుగా అలాగే నమిలి తినవచ్చు. భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసంసేవిస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం అద్భుతంగా పనిచేస్తుంది.

పుదీనా ఆకులు..: పుదీనా ఆకుల్లో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణాశయ గోడలను ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి. దీంతో పొట్టలో ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్ బయటకు వెళ్లిపోతుంది. వికారం తగ్గుతుంది. కొన్ని పుదీనా ఆకులను నోట్లో వేసుకుని నమిలి మింగవచ్చు. లేదా పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. అన్ని రకాల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అలాగే జీలకర్ర కూడా ఈ సమస్యలకు అద్భుతంగానే పనిచేస్తుంది. ఇందులో కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల జీలకర్రను తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ తగ్గిపోతాయి. జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. జీలకర్రను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఒక కప్పు మోతాదులో రోజుకు 2 సార్లు తాగుతుండాలి. లేదా ఒక గ్లాస్ మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి వేసి కలిపి తాగుతున్నా కూడా ప్రయోజనం ఉంటుంది.

బేకింగ్ సోడా, నిమ్మరసం..: బేకింగ్ సోడా సహజసిద్ధమైన అంటాసిడ్ మాదిరిగా పనిచేస్తుంది. ఇది జీర్ణాశయంలో అధికంగా ఉత్పత్తి అయ్యే యాసిడ్ల ప్రభావాన్ని తగ్గిస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, గుండెల్లో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఏర్పడే అసౌకర్యం తొలగిపోతుంది. అలాగే నిమ్మరసం యాసిడ్ స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ ఇది పొట్టలోకి చేరితే భిన్నంగా పనిచేస్తుంది. అందువల్ల ఈ రెండింటి మిశ్రమం పొట్టలో ఏర్పడే అసౌకర్యాన్ని తొలగిస్తుంది. ఒక గ్లాస్ నీటిలో అర టీస్పూన్ బేకింగ్ సోడా, సగం నిమ్మ చెక్క రసాన్ని పిండి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని రోజుకు ఒకసారి సేవించాలి. ఇలా చేస్తుంటే పొట్టలో ఏర్పడే అసౌకర్యం నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా అజీర్తి తగ్గిపోతుంది. దీని వల్ల విరేచనాల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

# ఆ అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లకు నెయ్యి విషంతో సమానమట..!



భారతీయ వంటకాల్లో చాలావరకు నెయ్యితో చేసేవే ఉంటాయి. స్వీట్స్ నుంచి టిఫిన్స్ వరకు ప్రతీది నెయ్యితో తినేవాళ్లు ఎక్కువగా ఉంటారు. నెయ్యితో ఆహారానికి అదనపు రుచి వస్తుంది. పప్పు, పచ్చడి, చపాతీ ఇలాఏదైనా సరే నెయ్యిలేకుండాతినేందుకు చాలామంది ఇష్టపడరు. వాస్తవానికి రోజూ నెయ్యి తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. కానీ కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు మాత్రం నెయ్యిని ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. వాస్తవానికి నెయ్యిలో ఎన్నో పోషకాలుంటాయి. నెయ్యి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు అందాన్ని కూడా పెంచుతుంది. అయితే గుండె, మూత్రపిండాల సమస్యలు ఉన్నవాళ్లు నెయ్యిని ఎక్కువగా వాడొద్దని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే నెయ్యిలో ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయని అంటున్నారు. అదేవిధంగా జీర్ణ సమస్యలతో బాధపడేవారు కూడా నెయ్యిని తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గ్యాస్, అజీర్ణం లాంటి సమస్యలతో బాధపడుతున్నవారు నెయ్యిని ఎక్కువగా తినకూడదని అంటున్నారు. జీర్ణ సంబంధ సమస్యలు ఉన్నవాళ్లు నెయ్యిని ఎక్కువగా తింటే ఆ సమస్యలు మరింత ఎక్కువ అవుతాయని హెచ్చరిస్తున్నారు. రక్తపోటు (బీపీ) సమస్యలు ఉన్నవాళ్లు కూడా నెయ్యిని దూరం పెట్టాలని నిపుణలు సలహా ఇస్తున్నారు. నెయ్యిలోని కొవ్వు ఆమ్లాలు రక్తపోటును పెంచుతాయని చెబుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం లాంటి సమస్యలు ఉన్నప్పుడు నెయ్యిని తినకపోవడమే మంచిదని అంటున్నారు. ఇక అధిక బరువు ఉన్నవాళ్లు, బరువు తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నవాళ్లు కూడా నెయ్యికి దూరంగా ఉండాలని చెబుతున్నారు. నెయ్యి ఎక్కువగా తింటే మరింత బరువు పెరిగిపోతారని నిపుణులు అంటున్నారు. నెయ్యిలో కాలరీలు కూడా ఎక్కువగా ఉంటాయని, అందువల్ల బరువు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మధుమేహం సమస్య ఉన్నవాళ్లు కూడా నెయ్యికి దూరంగా ఉంటేనే మంచిదని నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో ఉండే కొవ్వుల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి షుగర్ పేషెంట్స్ నెయ్యికి దూరంగా ఉండాలని అంటున్నారు.

## కుల వృత్తులను కాపాడుతామని చెప్పి నాశనం చేయాలని చూస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్: కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు.


## 'అయ్యో.. పాపం!'



కార్తికేయ నాలుగో తరగతి చదువు తున్నాడు. ఆదివారం కావటంతో ఆలస్యంగా నిద్ర లేచాడు. గమనించిన తల్లి పెరట్లో మొక్కలకు నీళు పట్టమని పురమాయించింది. కార్తికేయ అయిష్టంగా పెరట్లోకి వెళ్లాడు. అక్కడ నీళ్లు వృథాగా పోతున్నాయి. వెంటనే పంపుకు పైపు తగిలించి మొక్కలకు నీళ్లు పట్టసాగాడు. కార్తికేయ నీళ్లతో సరదాగా ఆడుకుంటూ మొక్కలకు నీళ్లు పెడుతున్నాడు. ఇంతలో తన దృష్టి ఒకచోట పడింది. అక్కడ ఓ బుజ్జి వానపాము భూమిలోంచి బయటకు రావటానికి ప్రయత్నిస్తున్నది. కార్తికేయ ఆసక్తిగా దాన్ని గమనించసాగాడు. చివరకు అది విజయం సాధించింది. భూమి మీదకు రాగానే దానికి అంతా కొత్తగా కనిపించింది. మెల్లగా అటూఇటూ పాకటం ప్రారంభించింది. అలా పాకుతూ చెట్టు కిందకు చేరింది. అక్కడే వున్న చీమలు, బుజ్జి వానపామును గుర్తించాయి. ఆహారం దొరికిందని ఆనందంతో వానపాము దగ్గరకు వచ్చాయి. దానికి ఏమీ అర్థం కాలేదు. చీమలన్నీ మూకుమ్మడిగా వానపాము మీద దాడిచేశాయి. వానపాము బిత్తరపోయింది. బాధతో శరీరాన్ని కదిలిస్తూ తప్పించుకోవాలని చూసింది. కానీ దాని వల్ల కాలేదు. భూమిలోకి వెళ్లాలని చూసింది. కానీ సాధ్యం కాలేదు. చీమలు కుట్టటంతో బాధతో మెలికలు తిరగసాగింది. బుజ్జి వానపాము పరిస్థితి కార్తికేయను కదిలించింది. దానిని రక్షించాలని నిర్ణయించుకున్నాడు. ఇంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తన చేతిలో వున్న నీళ్ల పైపును వానపాము వైపు మళ్లించాడు. అంతే.. నీళ్ల ధాటికి చీమలన్నీ వానపాముని వదిలి తలో దిక్కుకు పోయాయి. వానపాము బతుకు జీవుడా అనుకుంటూ భూమి లోపలికి పరుగు తీసింది. దానిని రక్షించానన్న ఆనందంతో కార్తికేయ తన పనిలో నిమగమయ్యాడు.

## క్షమించేద్దాం


### ఇస్లాం బోధ



ముహమ్మద్ ప్రవక్త (స) కాలంలో ఉహుద్ అనే యుద్ధం జరిగింది. ఈ సమరంలో హమ్జా అనే విశ్వాసిని చంపాలని అబూ సుఫ్యాన్ అనే ఇస్లామ్ శత్రువు భార్య హిందా కుట్ర పన్నింది. అనుకున్నట్లుగానే యుద్ధంలో హమ్జాను హతమారిస్తే బానిసత్వం నుంచి విడిపిస్తాననీ, తన కంఠహారం ఇస్తాననీ వహ్ షీ అనే తన బానిసను ఉసిగొల్పిందామె. వహ్ షీ యుద్ధరంగంలో దిగాడు. హమ్జా కోసం మాటువేశాడు. దొంగ చాటుగా బల్లెం విసిరాడు. అది హమ్జా పొట్టలో దూసుకుపోయింది. దాంతో ఆయన అక్కడికక్కడే కూలిపోయారు. అప్పుడు వహ్ షీ ఆనందంతో కేరింతలు కొడుతూ పరుగు పరుగున హిందాకు కబురందించాడు. 'నీకు కంఠహారం ఇస్తాగాని ముందు ఆ హమ్జా మృతదేహం ఎక్కడుందో చూపించు' అన్నది హిందా. అప్పుడు వహ్ షీ ఆమెను వెంటబెట్టుకుని హమ్జా మృతదేహం దగ్గరికి తీసుకెళ్లాడు. దాన్ని చూడగానే ఆమె కోపోద్రేకాలతో ఊగిపోయింది. కత్తితో హమ్జా పొట్ట చీల్చి కాలేయాన్ని బయటికి లాగింది. దాన్ని నిర్దయంగా కసకస నమిలింది. అయితే ఆ పచ్చికాలేయాన్ని నమిలి మింగలేక బయటికి కక్కేసింది. హమ్జాను చంపిన వ్యక్తికి కంఠహారం ఇచ్చేసింది.

## విశ్వాసానికి ప్రతీక హనోక్

### క్రీస్తు సందేశం



ప్రజలు దారి తప్పే సమయంలో కొన్ని హెచ్చరికలు చేస్తూ, రానున్న విపత్తులను ముందుగా సూచిస్తూ (ప్రవచిస్తూ) ప్రజల్ని సన్మార్గంలో నడిపించేవారు ప్రవక్తలు. ఈ ప్రవక్తలు చిన్న ప్రవక్తలని, పెద్ద ప్రవక్తలని ప్రాధాన్య సంఘటనల్ని బట్టి బైబిల్‌లో రెండు రకాలుగా కనిపిస్తారు. వారిలో హనోక్ ఒకరు. బైబిల్‌లో విశ్వాసానికి మారుపేరుగా అబ్రహామును చెప్పుకొంటారు. అంతకన్నా ఎక్కువగా హనోక్ విశ్వాసం కనిపిస్తుంది. భూమిపై దేవుడికి వ్యతిరేకంగా పాపపు చేష్టలు విజృంభించిన తరుణంలో ఏ జంకూ గొంకూ లేకుండా దేవుని కోసం ఎంతో నమ్మకంతో ఎదురుచూస్తూ తరించిన వ్యక్తి హనోక్. భక్తులు చాలామంది దేవునికి దూరంగా ఉండి తమ భక్తిని ప్రకటించిన వారే. కానీ, హనోక్ ప్రభువుతో నడయాడి ముచ్చటించాడు. అదీ ఈయన ప్రత్యేకత! తన జీవితాన్ని దేవుడికి ధారపోసి, దేవుడితోపాటు నడిచి మోక్షానికి చేరుకున్న హనోక్.. విశ్వాసానికి ప్రతీకగా దర్శనమిస్తాడు.

# అన్నదాత సేద్యానికి అడ్డంకులు!

**కరీంనగర్, తెలంగాణ దిశ :**కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి-94 కాలువ ఆయకట్టు రైతులు వానకాలం, యాసంగి పంటలకు సరైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో నాచు పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి వచ్చే డి-94 కాలువ రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి మీదుగా వెళ్తోంది. కరీంనగర్ గ్రామీణ మండల పరిధిలో 5,293 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. అయితే రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి వద్ద మురుగు నీరు నేరుగా ఈ కాల్వలోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు కాల్వలో నాచు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేస్తే సీతారాంపూర్, రేకుర్తి వద్ద కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. రైతులు ఎస్సారెస్పీ అధికారులకు మొరపెట్టుకున్నా నగరపాలక సంస్థ తీరుతో సమస్య పరిష్కారం కనుచూపుమేరలో కానరావటం లేదు. ప్రస్తుత వానకాలంలో కాల్వనీటి ఆధారంగా, వర్షాధారంగా పలు గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు వేశారు. బావులు, బోర్లు లేని పంటలు ఎడే పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది. గతంలో కాల్వ నీటిని పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు నగరపాలక సంస్థ మురుగు నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడుదల చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం కాల్వలో పేరుకుపోయిన నాచును తొలగించాలని సూచించారు.



నాచును తొలగించటానికి నగర పాలక సంస్థ టెండర్లు పిలిచింది. రూ.4.85 లక్షలతో వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభించారు. వేరేశాఖ పనులను నగరపాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తుందని విమర్శలు రావటంతో ప్రారంభించిన మరుసటి రోజే టెండర్ రద్దు చేసుకొని పనులను నిలిపివేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ మురుగునీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడవడం, వ్యర్థాలు తొలగిస్తామని చెప్పి మళ్లీ రద్దు చేసుకోవటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ కాల్వలో వ్యర్థాలు తొలగించటానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. మరుసటి రోజే టెండరు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. కాలువలోకి మురుగు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పంటలకు సక్రమంగా నీరందటం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

# కూపన్‌లు, లక్కీ డ్రాలతో నయా దందా..?

సిరిసిల్ల:వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు. జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై



కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు. రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

# ఆహారభద్రతపై ఆశలు



**పెద్దపల్లి, తెలంగాణ దిశ :** ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకుంటాం. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. - మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వ్యాఖ్యలు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు కొలమానం చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు మిథ్యగా మారింది. కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొనడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి వర్గ ఉపసంఘంలో కొత్త రేషన్‌కార్డుల విధి విధానాల కూర్పు తుది దశకు చేరింది. పరిమితికి లోబడి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టారు. కొత్త రేషన్‌కార్డు క్యూఆర్ కోడ్/మైక్రో చిప్/బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఉంటుంది. ఆదాయ, ఇతరత్రా అర్హతలపై చర్చలు కొనసాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత కొద్ది రోజులుగా ఉపసంఘం పలు మార్లు భేటీ అయ్యింది. మార్గదర్శకాలపై కూలంకషంగా చర్చించారు. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని 21న మరోసారి సమావేశం చేపట్టనున్నారు. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి వడబోత చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12,411 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. ఎట్టకేలకు లబ్ధిదారుల నిరీక్షణకు తెర పడనుంది. రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు నెలల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 28 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం చాలా మంది దొడ్డు బియ్యాన్ని తినడంలేదు. పలువురు బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# ఆటుపోట్లను తట్టుకుంటూ వరి కోతలు షురూ!



**ఎల్లారెడ్డిపేట, తెలంగాణ దిశ :**వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారుల తో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. 258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

# బిల్లులు రావు..భవనాలు పూర్తికావు!

మెట్‌పల్లి:మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండాలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనమిది. తలుపుల బిగింపు, ఫ్లోరింగ్, రంగులు వేయడం తదితర పనులు మిగిలిపోయాయి. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం గతంలో పాఠశాల భవనంలో కొనసాగగా ప్రస్తుతం మహిళా సంఘం భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడానికి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరవయ్యాయి. సమస్యల పరిష్కారం, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులు ఇలా అన్నీ ఇక్కడి నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పలుచోట్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో వేగం తగ్గింది. మరికొన్ని చోట్ల ఇతర కారణాలతో పనులు మొదలవలేదు. జిల్లాలో కొత్త పంచాయతీలతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరిన చోట పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె, కమ్యూనిటీ, పాఠశాల, మహిళా సంఘాల భవనాల్లో కొనసాగుతుండటంతో గ్రామసభలు, సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడం కష్టంగా మారింది. సుమారు రెండేళ్ల కిందట కొత్త పంచాయతీలతో పాటు భవనాలు



శిథిలావస్థకు చేరిన గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు దశల వారీగా నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. పనులు మొదలై కొన్ని చోట్ల పూర్తయ్యాయి. చాలా చోట్ల పనులను అసంపూర్తిగా వదిలేశారు. సకాలంలో బిల్లులు రావడం లేదని, వడ్డీకి డబ్బులు తెచ్చి భవనాలు నిర్మించామని గుత్తేదారులు వాపోతున్నారు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనన్న అనుమానంతో పనులు చేయడానికి విముఖత చూపుతున్నారు. కొన్ని పంచాయతీ భవనాలు స్థల సమస్య, ఇతర కారణాలతో నేటికి పనులు ప్రారంభం కాలేదు.

# కరుణించిన కాలం.. ఉబికివచ్చిన జలం

**కరీంనగర్, తెలంగాణ దిశ :**వానాకాలం ఆరంభంలో ఆశించిన వర్షాలు కురవక అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఈసారి సాధారణం కంటే తక్కువగానే కురుస్తాయోమోనని ఆవేదన చెందుతున్న తరుణంలో కాలం కరుణించింది. జులై, సెప్టెంబరు నెలల్లో దంచికొట్టిన వానలతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ సారి జిల్లాలో 37 శాతం అధికంగా వర్షం కురిసింది. భూగర్భ జలాలు పైకి ఉబికివస్తున్నాయి. గత మూడు నెలల్లో నీటిమట్టం తగ్గినప్పటికీ సెప్టెంబరులో పెరగడంతో యాసంగి పంటల సాగు అవసరాలకు భరోసా కలిగింది. ఈ ఏడాది జులైలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడంతో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు చేరి వాగులు ఉప్పొంగాయి. చెరువుల మత్తళ్లు దూకాయి. వరద కాలువలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లాలో నాలుగు నెలల్లో కలిపి 748.9 మి.మీ సాధారణం కాగా 1025 మి.మీ వర్షం కురిసింది. ఈ వానాకాలంలో 3.34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. జలాశయాలన్నీ నిండుగా నీరుండడంతో ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు



పైకివచ్చాయి. పంటలకు సమాంతరంగా వ్యవసాయ బావుల నుంచి నీరు జారుతోంది. జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.31 మీటర్ల లోతుకు నీటి మట్టం ఉబికివచ్చింది. గతేడాది సెప్టెంబరు నెలలో 3.40 మీటర్ల లోతులో నీరుంది. అత్యల్పం గా మానకొండూరు మండలంలో 1.36 మీటర్ల లోతులో నీరుండగా అత్యధికంగా గంగాధర మండలంలో 7.27 మీటర్ల లోతులో ఉంది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జలమట్టం రెట్టింపు స్థాయికి పెరిగింది.

# ఆనవాళ్లు కోల్పోతున్న మైసమ్మ గుట్ట

**సిరిసిల్ల, తెలంగాణ దిశ :** ప్రకృతి సంపదను అక్రమార్కులు చెరబట్టారు. ప్రభుత్వ నిర్మాణాల కిచ్చిన తాత్కాలిక అనుమతులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు అవసరాలకూ తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల రాయల్టీకి గండి పడుతోంది. వీటిపై తరచూ జిల్లా రెవెన్యూ, గనుల శాఖలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వెళ్తే అక్కడెవరూ కనిపించరు. ఇది మరీ విచిత్రమైన పరిస్థితి. జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దూరులోని మైసమ్మ గుట్టకు చారిత్రక ఆనవాళు ఉన్నాయి. అక్రమార్కులు వీటిని చెరిపేస్తున్నారు. మానేరు వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం సమయంలో రెండువైపులా కాంక్రీటుతో రక్షణ గోడలు నిర్మించాలి. దీనికి బలం చేకూర్చేందుకు మట్టితో నింపి రాళ్లతో తెట్టును నిర్మించాలి. అప్పుడే చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుంది. అయితే చెక్‌డ్యాం తొలి అంచనాల్లో ఈ ప్రతిపాదన లేదు. వరదలకు చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడంతో మట్టికట్ట, తెట్టు నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. దీనికోసం ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలకు మైసమ్మగుట్టను సగానికిపైగా తొలిచేశారు. ఇప్పుడు మట్టి తవ్వకాల్లో బయటపడిన రాళ్లను తొలుస్తున్నారు. జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతంలో ఆదిమానవుల జీవనవిధానాలను చరిత్రకారులు కనుగొన్నారు. సిరిసిల్ల శివారులోని బర్కమ్మ, సీతారి గుట్ట ప్రాంతాల్లో పలు రాతి చిత్రాలు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా పరిశోధనలు కూడా జరిగాయి.

మైసమ్మ గుట్ట పూర్వం వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు పరిశోధకులు అధ్యయనాల్లో గుర్తించారు. ఇక్కడ ఉన్న మట్టి ప్రతిమలను గ్రామదేవతలుగా ఇప్పటి కీ కొలిచి పూజలు చేస్తారు. ఇవి ఎప్పటివనేది కూడా నిర్ధారణ కాలేదు. పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లో కొన్ని రూపాలు గ్రామ దేవతలుగా కొలుస్తారని మాత్రం చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అరుదైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గుట్ట చుట్టూ తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.



# మిల్లుల్లో రేషన్ బియ్యం దందా!


# చోద్యం చూస్తున్న అధికారులు?



**వేములవాడ, తెలంగాణ దిశ :** పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొంత మంది అక్రమార్కులు రైస్ మిల్లులు కేంద్రంగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. వేములవాడ పట్టణం పరిసరాలు, గ్రామీణ మండలం మర్రిపల్లి ప్రాంతంలోని కొన్ని మిల్లుల నిర్వాహకులు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ సేకరించిన వాటిని మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతరులకు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ ఏ శాఖ అధికారులు మిల్లులను తనిఖీ చేసి ఈ అక్రమాలను అరికట్టిన దాఖలాలు లేవు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. రైస్ మిల్లులు, రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో పలు రైస్ మిల్లుల్లో ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఒక వేళ తనిఖీ చేసినా పట్టు బడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇటీవల కొందరు ఫిర్యాదు చేయడంతో వేములవాడ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ తతంగం కొనసాగు తుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు

**సిరిసిల్ల, తెలంగాణ దిశ :** దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రానున్నాయి. ప్రసాద్ (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని చేర్చనున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఈ ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో తుది నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పథకం కింద ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు. దీనికి ముందు వేములవాడ పురపాలిక మాస్టర్ ప్లాన్-2050 అమలు కావాలి. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన ఈ ప్రక్రియ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు ముందే నిలిచిపోయింది. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణం అభివృద్ధి రెండూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్న అంశాలు. దీనికోసం ఏర్పాటు చేసిన వీటీఏడీఏతో ఆలయ విస్తరణ, అభివృద్ధి, పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన వాటిపై ఇప్పటికే



ప్రణాళికలు రూపొందించారు. ఇది పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మాస్టర్‌ప్లాన్ ప్రధానం. దిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తు అవసరాలు తీర్చేలా కొత్త ప్రణాళిక అమలు కానుంది. పురపాలిక పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో నివాస, వాణిజ్య జోన్‌లుగా ఏర్పాటు చేయనున్నారు.


# విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉంది

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, తెలంగాణ దిశ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు అస్వస్థతకు గురికావడంతో వారిని ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నామని వారి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న బి. తరుణి (8వ తరగతి) జ్వరంతో బి. రేవతి (6వ తరగతి) టాన్సిలైటిస్ తో కూడిన జ్వరంతో బాధపడుతుండగా మాతా శిశు ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు విద్యార్థినిలు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని మీడియా ప్రతినిధులు సందర్శించినప్పుడు వైద్యులు ఈ విషయాన్ని నిర్ధారించారని, చికిత్స కొనసాగుతుందని ఎ.టి.డి.ఓ. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై కొంత మంది కలుషిత ఆహారం తినడం వల్ల ఇలా జరిగిందని అవాస్తవాలు ప్రచారం చేసి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇలాంటి అవాస్తవ అనాలోచిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# రైతు కల !



మామిడి చిగురు తిని మత్తెక్కి కూసే కోకిల గానం గమ్మత్తుగా వుంటుంది. 'మామిడి చెట్టు పెరట్లో వుంటే ఆ ఇంటి పెద్దకొడుకు వున్నట్లే..' అని పెద్దలు చెబుతారు. మామిడి చెట్టును చూస్తే జీవితం కనబడుతుంది. 'లేత వగరు పిందె%ౌ% యవ్వనం/ పులుపు.. మధ్య వయస్సులోని బింకం/ పండ్ల రసం.. వయస్సుతో వచ్చే అనుభవాల మాధుర్య సారం/ దీనిని పొగడ నా తరమా..' అంటాడో కవి. అన్ని వయసుల వారిని అలరించి, పలకరించి కడుపు నింపే అమృత వృక్షం మామిడి. అందుకే అంటాడు ప్రముఖ హిందీ కవి గుల్జార్.. 'మామిడి పండు అంటే ఒక తీయని అనుభవం మాత్రమే కాదు, చిన్ననాటి అనుభూతి, మధుర జ్ఞాపకాలు కూడా' అని. మామిడిలో తీపి, పులుపు, అరుదైన సుగంధం వంటి భావ ప్రతీకలతో పాటు, శరీరాన్ని శీతలపరిచే ఔషధం, మనసును తీపిగా మార్చే అనుభవం వుందని ఆయుర్వేదం చెబుతుంది. మామిడిని ఉష్ణమండల వాతావరణాలలో పండిస్తారు. ప్రపంచంలోని మామిడి సరఫరాలో దాదాపు సగం భారతదేశం నుంచే ఎగుమతి అవుతుంది. 5వేల సంవత్సరాల క్రితం నుంచే దేశంలో మామిడి సాగు చేస్తున్నారని చరిత్ర చెబుతోంది. వాణిజ్య రకాలు సహా మొత్తం 1500 రకాల మామిడిని పండిస్తారు. ఇవి మన సంస్కృతిలో భాగం అయిపోయాయి. మామిడి రుచి, దాని మాధుర్యాన్ని, ఆరోగ్య ప్రయోజనాలను తలచుకుంటూ.. ప్రతి ఏడాది జులై 22న జాతీయ మామిడి దినోత్సవం జరుపుకుంటారు.

'పాటలే తప్ప జీవితాలే వినిపించవు ఈ దేశంలో' అంటాడు మహాకవి శ్రీశ్రీ. రైతు పాట వినిపించదు. అతని విలాపం తప్ప. రైతు బతకడం సమాజానికి అవసరం. కానీ, మరణించాకే రైతుకు గుర్తింపు. ఇది మామిడి రైతుల విషాదగాథ కూడా. 'మామిడి ఫలంలో తియ్యటి కవిత్వం దాగి వుంది' అంటారో కవి. కానీ, మామిడిలోని మాధుర్యం రైతుల జీవితంలో కనబడదు. రాష్ట్రంలో మొత్తం 12 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతుండగా, ఒక్క చిత్తూరు జిల్లాలోనే లక్ష ఎకరాల వరకూ రైతులు తోతాపురి రకం సాగు చేస్తున్నారు. నూజివీడు మామిడికి ప్రత్యేక గుర్తింపు వుంది. గత నాలుగేళ్లుగా నష్టాల్లో వున్న రైతులకు ఈ ఏడాది మామిడి దిగుబడి ఆశాజనకంగా మారింది. ఉత్పత్తి పెరగడంతో కిలో రూ.2, రూ.3 ధరకే పరిమితం చేసి మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోపిడీ చేస్తున్నారు. నోరూరించే పచ్చళ్ల దగ్గర నుంచి జ్యూస్‌లు, జామ్‌ల వరకు కార్పొరేట్ కంపెనీలు పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నాయి. రైతుల పట్ల కనికరం లేకుండా ప్రభుత్వం పరిశ్రమలకు ఊడిగం చేస్తోంది. రైతులకు కిలో రూ.12 చొప్పున ధర ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదు. సిండికేట్‌గా మారిన వ్యాపారులు రూ.4కు మించి కొనకుండా రైతులను నిలువునా ముంచుతున్నారు. పరిశ్రమల గుత్తాధిపత్యం నుండి రైతులను ఆదుకోవడానికి మార్కెటింగ్ ఏజెన్సీల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రం ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తోతాపురి రకం మామిడి కిలో రూ.2లకే అడుగుతుండటంతో కాయలను తోటల్లోనే వదిలేస్తున్నారు. ఆశ చావని మరికొందరు రైతులు పల్ప్ పరిశ్రమలకు, మండీలకు తరలిస్తున్నారు. అక్కడ కూడా అదే ధర చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పంటనురోడ్డు పాలుచేసి, చమర్చిన కళ్లతో ఇల్లు చేరుతున్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అయినా దక్కేలా చర్యలు తీసుకోకపోతే.. మామిడి రైతుల ఆత్మహత్యలను కూడా రాష్ట్రం చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. సాంకేతికతతో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని చెబుతోన్న రాష్ట్ర ప్రభుత్వం.. సంప్రదాయకంగా వస్తోన్న పంటలను పక్కనపెట్టి, లాభసాటిగా వుండే తోటలను పెంచమని సలహా ఇస్తోంది. ఒక్క మామిడికే కాదు.. పామాయిల్, కోకో, పొగాకు, పసుపు, మిర్చి వంటి పంటలకూ ధరలేక రైతులు రోడ్డెక్కుతున్నారు. ప్రభుత్వం రైతుల సమస్యపై స్పందించాలి. రైతులను ఆదుకోవాలి. మనం తినే ప్రతి మామిడికాయ వెనుక ఒక రైతు కల వుంటుంది.. ఒక ఆశ వుంటుంది. ఆ కలను చెరపకుండా, ఆశను చంపకుండా చూడటమే.. నిజమైన బాధ్యత. అదే.. మామిడి జాతీయ దినోత్సవానికి నిజమైన అర్థం.

# తెలంగాణలో స్థానిక సంస్థల సంఖ్య ఖరారు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రాష్ట్రంలోని జెడ్పీ, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రకటన చేసింది. జడ్పీలు 31, ఎంపీపీలు 566, జడ్పీటీసీలు 566, ఎంపీటీసీలు 5,773, గ్రామపంచాయతీలు 12,778, వార్డులు లక్షా 12 వేలు ఉన్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను బుధవారం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు వెల్లడించింది.రాష్ట్రంలో మొత్తం 12,778 గ్రామ పంచాయతీలు ఉండగా?

1.12 లక్షల వార్డులు ఉన్నట్లు ప్రభుత్వం వివరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో వీటిపై ప్రకటన చేసింది.మరోవైపు స్థానిక సంస్థలఎన్నికలకు సర్వం సిద్ధం కావాలని పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది.

**ఏర్పాట్లు ముమ్మరం:** తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఓవైపు ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకువేస్తుండగా? మరోవైపు ఏర్పాట్ల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే? షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమైంది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకునే పనిలో పడింది. అయితే అధికారంలోకి రాకముందు నుంచే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన ఆ పార్టీ?. కామారెడ్డిలో డిక్లరేషన్ కూడా చేసింది. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా?. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులగణన చేపట్టింది. డెడికేషన్ కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి కూడా పంపింది.కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ జారీకి కేబినెట్ నిర్ణయించింది. అయితే శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేయకుండా ఆర్డినెన్స్ తీసుకురావడానికి నిబంధనలు అంగీకరించవు. ఈ నేపథ్యంలో?. శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంటుంది.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఆధారంగా? స్థానిక ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతమవుతుంది. ఆ వెంటనే రిజర్వేషన్లపై ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంటుంది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారవుతాయి. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లే అమల్లో ఉంటాయా?? లేక ఏమైనా మార్పులు ఉంటాయా?? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఇచ్చే ఆర్డినెన్స్ నిలబడుతుందా అన్న చర్చ గట్టిగా తెరపైకి వస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 50 శాతం రిజర్వేషన్లు దాటవద్దనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ తీసుకువచ్చే ఆర్డినెన్స్ పై అనేక అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కోర్టుల ముందుకు ఈ ఆర్డినెన్స్ నిలబడవనే విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లులను 9వ షెడ్యూల్ చేర్చి? పార్లమెంటు ఆమోదం పొందే దిశగా ముందుకెళ్తే తప్ప? రిజ్వేషన్ల పెంపు సాధ్యం కాదని పలువురు

చెబుతున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది. ఈ నేపథ్యంలో ఇదే బిల్లుకు సంబంధించి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చా అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలున్నాయి. 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, 585 జడ్పీటీసీ స్థానాలు ఉండగా? వీటన్నింటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆర్డినెన్స్ జారీ తర్వాత? ఎన్నికల ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఒక వేళ ఆర్డినెన్స్ జారీపై న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతే?. ప్రభుత్వం ఎలా ముందుకెళ్తోందనేది కూడా చర్చనీయాంశంగా మారింది?!రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేసే పనిలో ఉన్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. ఇక అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోని స్థానిక పోరులో సత్తా చాటాలని బీఆర్ఎస్ తో పాటు బీజేపీ చూస్తున్నాయి.రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశావాహులు పావులు కదిపేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రాగానే? మరింత దూసుకెళ్లాలని భావిస్తున్నారు. చాలా రోజులుగా గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గెలుపు కోసం అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈసీ నుంచి ప్రకటన వెలువడితే? పల్లెల్లో పొలిటికల్ హీట్ మరింత పెరగనుంది.రాష్రంలోని గ్రామపంచాయతీల్లోని సర్పంచ్ లో పదవీ కాలం గతేడాది జనవరి 31వతో ముగిసింది. 2024 జూన్ మాసంలోనే ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. ఈ స్థానాలకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. పదవీకాలం ముగిసిన తర్వాత వెంటనే నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ? ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత కుల గణన కార్యక్రమం చేపట్టడంతో ఆలస్యమైంది.

# మహిళా ఆరోగ్య వికాస్..

## ఉచిత ఆరోగ్య శిబిరం...



జమ్మికుంట శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసములతో, రోజున "అమ్మ ఆరోగ్యమే సమాజ సౌభాగ్యం "వికాస తరంగిణి నిర్వహించే మహిళ ఆరోగ్య వికాస్. ఉచిత ఆరోగ్య శిభిరం గర్భశాయ ముఖ ద్వార మరియు రొమ్ము పరీక్షలు జమ్మికుంట వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, బచ్చు వీరలింగం, పుల్లూరి ప్రభాకర్ రావు, డింగరి హరికృష్ణమాచార్యులు. పుల్లూరి శ్రీనివాస్,అంతం రాజిరెడ్డి, ఎదులాపురం వెంకటేష్,శీలం శ్రీనివాస్, ఎలవేణి సమ్మయ్య, మహిళావికాస్. అధ్యక్షులు కర్ర రజిత దేవి, మరియు వికాస తరంగిణి జమ్మికుంట శాఖ సభ్యులు మహిళ సభ్యులు అందరూ పాల్గొన్నారు. డాక్టర్ ఎం.మౌనిక, పద్మ, సారిక ల ఆధ్వర్యంలో 108 మందికి ఉచిత పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది....

# మూఢనమ్మకం మత్తులో గ్రామస్థులు

## స్వామిజీ సూచనతో వనవాసం

నల్లగొండ, :వరుసగా ఒకరి తరువాత వకరు చనిపోతున్నారు.. దశదినకర్మ పూర్తికాక ముందే మరొకరు మృతి చెందడం ఇలా రెండు నెలలుగా జరుగుతోంది. దీనికి తోడు వర్షాలు లేకపోవడంతో గ్రామాని కి కీడు సోకిందని గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఇదీ తక్కెళ్లపహాడ్ గ్రామస్తుల పరిస్థితి! వానాకాలం సీజన్ ప్రారంభంలో పత్తితోపాటు మెట్టపంటలను కూడా గ్రామస్తులు సాగు చేశారు. అయితేవర్షాలు లేక విత్తిన పత్తివిత్తనాలు మొలకెత్తక..రెండు మూడు సార్లు విత్తారు. భూగర్భ జలాలు అడుగంటి నారుమళ్లు ఎండిపోతున్నాయి. ఒకవైపు వరస మరణాలు, మరోవైపు వర్షాలు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక గ్రామస్తులు తలలు పట్టుకున్నారు. చేసేదేమి లేక చివరకు గ్రామస్తులంతా కలిసి నకిరేకల్ లోని ఓ స్వామీజీని కలిశారు. గ్రామంలో వరుస మరణాలు సంభవించడం.. వర్షాలు కురవకపోవడానికి కీడే కారణమని చెప్పారు. కీడు పోవాలంటే గ్రామ స్తులందరూ ఊరు విడిచి వెళ్లి.. ఓ ప్రాంతంలో కీడు వంటలు వండు కోవాలని.. స్వామీజీ గ్రామస్థులకు సూచించారు.స్వామీజీ సూచన మేరకు:స్వామీజి సూచన మేరకు తక్కెళ్లపహాడ్ గ్రామస్తులంతా ఊరు విడిచి ఒక్కరోజు వనవాసానికి వెళ్లాలని నిర్ణయి ంచారు. అందరూ ఊరు విడిచి వెళ్లాలని, గ్రామంలో ఒక్కరు కూడా ఇంట్లో పొయ్యి వెలిగించొద్దని, కిరాణ, మద్యం బెల్టు దుకాణాలు తెరవొద్దని, కోళ్లు, మేకలను కోయొద్దని దండోరా వేయించారు. ఊరు విడిచివెళ్లకున్నా, దుకాణాలు తెరిచినా రూ.5 వేలు, గ్రామంలో కోళ్లు,మేకలు కోసి మాంసం విక్రయిస్తేరూ.10 వేలు జరిమానా విధిస్తామని దండోరావేయించారు. ఇంకేముంది అందరూఉదయం 6 గంటల కు..ఇళ్లకు తాళం వేసి.. ఆదివారం పొలం బాట పట్టారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి వనవాసా నికి వెళ్లారు. సాయంత్రం చీకటి పడేంత వరకు అక్కడే గ్రామస్తులంతా కుటుంబ సభ్యులతో కలిసి కీడు వంటకాలను వండుకొని తిన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్ లో కీచులాటలు




**నల్గొండ, తెలంగాణ దిశ :** ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరుకు పెట్టింది పేరు. ఇది కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సొంత నియోజకవర్గం. 2009 వరకు ఈ సెగ్మెంట్ జనరల్ క్యాటగిరి కింద ఉండటంతో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఇక్కడ నుంచి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. 2009 తర్వాత ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారడంతో..ఆయన సూర్యాపేటకు షిఫ్ట్ అయ్యారు. అయినా తన సొంత సెగ్మెంట్ తుంగుతుర్తి పాలిటిక్స్ తన కనుసన్నుల్లోనే జరిగేలా చూసుకుంటారు దామోదర్ రెడ్డిఇప్పటికీ తుంగతుర్తిలో దామోదర్ రెడ్డికి బలమైన అనుచరవర్గం ఉంది. అందుకే అక్కడ ఎవరు పోటీ చేయాలన్నా.. దామోదర్ రెడ్డి మద్దతు ఉండాల్సిందే. అయితే గతంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఉన్న అద్దంకి దయాకర్, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మందుల సామేల్..దామోదర్ రెడ్డి వర్గాన్ని పక్కనపెట్టి పనిచేయాలని ప్రయత్నిస్తుండటంతో గ్రూప్ వార్ రచ్చకెక్కుతోంది. దీంతో నియోజకవర్గంలో ఏ కార్యక్రమం జరిగినా.. ఆధిపత్యపోరు..పరస్పరం దాడులతో ఇష్యూ అవుతోంది. రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవం కోసం సీఎం రేవంత్ రెడ్డి తాజాగా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశాయి పార్టీ శ్రేణులు. అయితే సీఎంకు స్వాగతం పలుకుతూ మాజీ మంత్రి దామోదర్ రెడ్డి వర్గం పెట్టిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపేశారు.ఎమ్మెల్యే తనయుడే ఫ్లెక్సీలను చింపేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక గతంలోనూ పలు కాంట్రవర్సీల్లో మందుల సామేల్ పేరు ప్రచారం జరిగింది. కమిషన్ ఇవ్వాలంటూ లిక్కర్ వ్యాపారులతో ఆయన మాట్లాడినట్లు బయటికొచ్చిన వీడియోతో విమర్శలు ఎదుర్కొన్నారు ఎమ్మెల్యే. ఇక సొంత పార్టీ నేతలతో వైరం ఉండే ఉంది. ఈ అంశాలన్నీ సీఎం దృష్టికి వెళ్లడంతోనే..తిరుమలగిరి సభా వేదికగానే..పద్ధతి మార్చుకోవాలని డైరెక్ట్‌గా స్థానిక ఎమ్మెల్యేకు చురకలు అంటించారు రేవంత్.అసంతృప్తిగా ఉన్నవాళ్లను కూడా కలుపుకొని పోవాలని వేదిక మీదే చెప్పారు సీఎం రేవంత్. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు అంతా ఒక్కటై గెలిపించారు..ఇప్పుడు వాళ్లను నువ్వు గెలిపించాలంటూ..తుంగతుర్తి ఎమ్మెల్యేపై చేయి వేసి మరీ మాట్లాడారు ముఖ్యమంత్రి. రేవంత్ మాటలను బట్టి చూస్తే..వ్యవహార శైలి మార్చుకోవాలని ఎమ్మెల్యేకి చెప్పినట్టేనన్న చర్చ జరుగుతోంది. అయితే ఎమ్మెల్యే సామెల్ అందర్నీ కలుపుకొని పోవడం లేదని..పాతవారిని పక్కనపెట్టి కొత్తవారిని ప్రోత్సహిస్తున్నారని లోకల్ లీడర్లు ఆరోపిస్తున్నారు.పాత కాంగ్రెస్ నేతలకు, కొత్త క్యాడర్‌కు గ్యాప్ ఉందన్న ప్రచారం జరుగుతోంది. వీటన్నింటిని ఇంటెలిజెన్స్ వర్గాలు ఎప్పటికప్పుడు సీఎంకు నివేదిస్తూనే ఉన్నాయట. దీంతో ఆయన కూడా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై దృష్టి పెట్టారని.. అందులో భాగంగానే సభాముఖంగా అందరికీ విషయం అర్థం అయ్యేట్టు చెప్పారన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా ఆధిపత్య పోరు సమసిపోతుందా లేక ఎవరికీ వారే అన్నట్లు నడుచుకుంటారా అనేది వేచి చూడాలి.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ!

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల, తెలంగాణ దిశ :** జిల్లాలో మొత్తం 14 వేల నూతన రేషన్ కార్డుల పంపిణీసిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు చంద్రంపేట రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ.అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలోసిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని అర్హులైన 2610 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 4527 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 21 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ అవుతున్నాయని తెలిపారు.అన్నిటికి కీలకం: రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగ పడుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కోసం కూడా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.జిల్లాలో నూతనంగా 14 వేల లబ్ధిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కే కే. మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా పెంపుపై సర్కార్ దృష్టి



విశాఖపట్టణం, తెలంగాణ దిశ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్య ఎక్కువగా ఆందోళన చెందుతున్న విషయం జనాభా తగ్గుదల. ఏపీ జనాభా పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండటం లేదని.. ఇలాగైతే భవిష్యత్తులో ఊర్లు ఉండవంటూ చంద్రబాబు పలు సందర్భాలలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగానూ చంద్రబాబు మరోసారి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అయితే చంద్రబాబు ఆందోళన వెనుక అనేక కారణాలు ఉన్నాయి. చంద్రబాబు నాయుడు గతంలో జనాభా నియంత్రణ విధానాన్ని గట్టిగా సమర్థించారు. అధిక జనాభా వల్ల ఇబ్బందులు తప్పవన్న ఆయన.. ఒక్కరు ముద్దు అనే విధానాన్ని పాటించాలని అప్పట్లో పిలుపునిచ్చారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోవడంతో చంద్రబాబు స్టాండ్ మారింది. పిల్లల్ని కనండి.. అవసరమైతే ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఏపీలో జనాభా పెరుగుదల రేటు తగ్గడం మంచిది కాదని.. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కొత్త జంటలు పిల్లలను కనాలని ఆయన సూచిస్తున్నారు. చంద్రబాబు ఈ మధ్య ఓ అడుగు ముందుకేసి.. ముగ్గురు కంటే ఎక్కువమంది పిల్లలను కన్నవారే నిజమైన దేశభక్తులు అనే వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని.. జనాభా స్థిరత్వం కోసం సంతానోత్పత్తి రేటు 2.1గా ఉండాల్సి ఉండగా.. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.7గా ఉందని చంద్రబాబు చెబుతున్నారు. చంద్రబాబు ఎందుకిలా పిల్లలను కనమని చెప్తున్నారో చైనా, జపాన్ దేశాలను చూస్తే అర్థమవుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. ఎందుకంటే పిల్లల్ని కనే జంటలకు ఈ దేశాల్లో ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. 'ఒక్కరు ముద్దు - ఇద్దర వద్దు' అంటూ గతంలో పిలుపునిచ్చిన కమ్యూనిస్టు దేశం చైనా.. ఇప్పుడు యువ జనాభా తగ్గుదలతో ఇబ్బందులు పడుతోంది. పనిచేసే యువకుల సంఖ్య తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో చైనా ఆర్థిక రంగం మీద ఆ ప్రభావం పడుతోంది. దీంతో అప్రమత్తమైన బీజింగ్ పాలకులు పిల్లలను కనాలని చైనీయులను కోరుతున్నారు. పిల్లలను కనే వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. చైనాలోని ఇన్నర్ మంగోలియాలో.. రెండో బిడ్డను కన్న జంటకు 50 వేల యువాన్లు అందిస్తున్నారు. ఇది భారత కరెన్సీలో దాదాపు రూ.6 లక్షలు. ఇక మూడో బిడ్డను కన్న దంపతులకు లక్ష యువాన్లు అందిస్తోంది అక్కడి ప్రభుత్వం. చైనాలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు.. పిల్లలను కనే జంటల కోసం ఇలాంటి రాయితీలను ఇప్పటికే ప్రకటించాయి. ఇల్లు కట్టుకోవడానికీ రాయితీలు అందిస్తున్నారు. పుట్టే ప్రతి బిడ్డకు ఏడాదికి 3600 యువాన్ల చొప్పున.. మూడేళ్లపాటు ఇవ్వాలనే యోచనలో చైనా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆ లెక్కన పుట్టే ప్రతి బిడ్డకు కూడా మన భారతీయ కరెన్సీ ప్రకారం ఏటా రూ.43000 ఇవ్వాలనే ఆలోచన చైనా ప్రభుత్వం చేస్తోంది. ఒక దేశం లేదా రాష్ట్రంలో జనాభా స్థిరంగా పెరగకపోతే అది దాని ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పెరిగిన మౌలిక వసతులు, వైద్యారోగ్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా.. సగటు మనిషి ఆయుర్దాయం పెరిగింది. అలాగే మారుతున్న జీవన శైలి, విపరీతంగా పెరుగుతున్న ఖర్చులు, చిన్న కుటుంబాల కారణంగా నేటి యువత పెళ్లి పట్ల, పిల్లలను కనడం పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఏటేటా వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. పనిచేసే యువ జనాభా తగ్గుముఖం పడుతోంది. దీంతో ఉత్పత్తి తగ్గి.. ఆర్థిక వ్యవస్థలో వేగం తగ్గుతుంది. పనిచేసే వారి సంఖ్య తగ్గితే అది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే వృద్ధుల సంరక్షణ కోసం చేసే ఖర్చు కూడా ప్రభుత్వాలకు భారంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనేది చంద్రబాబు ఆందోళన. పరిస్థితి ఇలాగే కొనసాగితే మన రాష్ట్రంలోనూ యువత తగ్గిపోతారని చంద్రబాబు అంటున్నారు. ఇందులో రాజకీయ కోణం కూడా లేకపోలేదు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని.. ఇన్నాళ్లు కుటుంబ నియంత్రణను పటిష్టంగా అమలు చేసిన తమకు పార్లమెంట్‌లో ప్రాధాన్యత తగ్గుతుందనేది దక్షిణాది రాష్ట్రాల ఆందోళన. దీంతో తమిళనాడు

### ఇద్దరిని కంటే ఎక్కువ మందైతే ప్రోత్సాహకాలు

సీఎం స్టాలిన్ సైతం పిల్లలను కనాలని పిలుపునిస్తున్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేకపోయేది. ఈ చట్టంలో చంద్రబాబు మార్పులు చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాతృత్వ సెలవులు, పితృత్వ సెలవుల విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేస్తోంది. అయితే జనాభా పెరుగుదల కోసం చంద్రబాబు చెప్తున్న కారణాలపైనా భిన్నమైన వాదనలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉన్న చైనాను ఇండియా వెనక్కి నెట్టింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ జనాభాకు అవసరమైన మౌలిక వసతులు.. కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస అవసరాలు అందని అభాగ్యులు కూడా మనదేశంలో ఉన్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. అలాగే ప్రస్తుతం విద్య, వైద్యం మనదేశంలో చాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. జీవన వ్యయం కూడా భారీగా పెరిగింది. దీంతో భార్యాభర్తలిద్దరూ పని చేస్తే గానీ పిల్లలను చదివించలేని పరిస్థితి. ఇప్పటికే ఉపాధి కోసం యువ జంటలు నగరాల్లో నివాసం ఉంటుండగా.. పెద్దలు మాత్రం సొంతూర్లలో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరికి మించి పిల్లలను కనడం సాధ్యమేనా అనే ప్రశ్న వినిపిస్తోంది. చిన్న ఊళ్లలోనూ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. పిల్లలను కంటూ పోతే.. వారి బాగోగులు ఎవరు చూసుకుంటారు అని ప్రశ్నించే వారూ ఉన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కనడానికి యువ జంటలు ముందుకు రావాలంటే.. ప్రభుత్వం నుంచి మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లికి వందనం వంటి పథకాల ద్వారా చిన్నారుల చదువుకు ఆర్థిక భరోసా అందిస్తున్నప్పటికీ.. అది పిల్లల చదువు కోసమే ఖర్చయ్యే పరిస్థితి. పిల్లలు పుట్టగానే వారి ఖాతాలో కొంత నగదు జమ చేయడంతోపాటు.. పిల్లలకు కనీసం ఐదేళ్లు వచ్చే వరకూ ఏటా కొంత మొత్తం ఆర్థిక సహకారం అందించడం.. విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు చేయడం ఎంతో అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇవన్నీ చేయాలంటే భారీ మొత్తంలో నిధులతోపాటు ప్రభుత్వానికి ఓ ప్రణాళిక, సన్నద్ధత అవసరం. ఎక్కువ మంది పిల్లలను కనడం ద్వారా.. తమ దేశభక్తి నిరూపించుకోవడానికి యువ జంటలు సిద్ధపడాలంటే.. అంత కంటే ముందు తగిన కార్యాచరణ రూపొందించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

## ఇక పాఠశాలలోనే ఆధార్ అప్ డేట్




ఢిల్లీ: 5 సంవత్సరాలు దాటిన పిల్లలందరికీ పాఠశాలలో ఆధార్ ను అప్ డేట్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సిఈవో భువనేష్ కుమార్ వార్తా సంస్థ పిటిఐకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ% 5ఏళు దాటిన 7 కోట్లకు పైగా పిల్లలు తమ ఆధార్ బయోమెట్రిక్ నవీకరణలను పూర్తి చేయలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల అనుమతితో పాఠశాలల ద్వారా పిల్లల బయోమెట్రిక్‌లను నవీకరించడం ప్రారంభించడానికి ఒక ప్రాజెక్ట్‌పై పని చేసున్నామని తెలిపారు. తాము ప్రస్తుతం సాంకేతికతను పరీక్షిస్తున్నామని, ఇది 45-60 రోజుల్లో సిద్ధం అవుతుందని ఆయన వివరించారు. పిల్లల బయోమెట్రిక్ డేటా యొక్క ఖచ్చితత్వం, విశ్వసనీయతను నిర్వహించడానికి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ (ఎంబియు) సకాలంలో పూర్తి చేయడం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. నవీకరించబడిన బయోమెట్రిక్స్‌తో కూడిన ఆధార్ జీవన సౌలభ్యాన్ని నిర్ధారిస్తుందని, పాఠశాల ప్రవేశాలు, ప్రవేశ పరీక్ష రిజిస్ట్రేషన్లు, స్కాలర్‌షిప్‌ల ప్రయోజనాలను పొందడం, వర్తించే చోట డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) పథకాలు వంటి సేవలను యాక్సెస్ చేయడానికి ఆధార్‌ను సజావుగా ఉపయోగించుకోవడానికి వీలు కల్పిస్తుందని ఆయన తెలిపారు.

### ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై అదుపుతప్పిన ఎయిర్ ఇండియా విమానం

ముంబై : ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. కొచ్చి నుంచి ముంబై వచ్చిన విమానం ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై అదుపుతప్పింది అయితే, అదృష్టవశాత్తూ అందులోని ప్రయాణికులు, సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదని ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎయిర్ ఇండియాకు చెందిన ఓఎ 2744 విమానం తెల్లవారుజామున కొచ్చి నుంచి ముంబైకి వచ్చింది. ఉదయం ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా..

రన్‌వేపై అదుపుతప్పింది. ముంబైలో రాత్రి భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. ఈ వర్షం కారణంగా రన్‌వేపై విమానం అదుపుతప్పినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. విమానం రన్‌వేపై అదుపుతప్పినప్పటికీ సురక్షితంగా నిర్దేశించిన బేకు చేరుకోగలిగిందని పేర్కొన్నారు.

ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదని వెల్లడించారు. అనంతరం విమానాన్ని తనిఖీ కోసం తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## అమరావతికి మైక్రోసాఫ్ట్...




విజయవాడ,, తెలంగాణ దిశ : ఏపీకి గుడ్ న్యూస్. మరో దిగ్గజ పరిశ్రమ ఏపీకి రానుంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ అమరావతి క్వాంటం వ్యాలీకి వస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ పసరత్తు ప్రారంభించింది. క్వాంటం కంప్యూటర్ తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అధికారులతో చర్చలు కూడా జరిగాయి. త్వరలో ఏపీ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఎంవోయూ కుదరనుంది. ఇప్పటికే ఐబీఎం 156 క్యూబిట్ల సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఐబీఎం బాటలోనే మైక్రోసాఫ్ట్ నడవనుంది. ఐబీఎం సంస్థ క్వాంటం కంప్యూటర్ కు భిన్నంగా మైక్రోసాఫ్ట్ మరో క్వాంటం కంప్యూటర్ ఉండనుంది. సాంకేతికంగా అత్యున్నతంగా క్వాంటం కంప్యూటర్లుసేవలందించనున్నాయి. వీటిలో సూపర్ కండక్టింగ్, ట్రాప్డ అయాన్, పోటానిక్, టోపో లాజికల్, న్యూట్రల్ ఆటమ్ లు ఉన్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ కొత్త భవనం కట్టనుంది. ఇది నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అయితే ఈ భవనం మైక్రోసాఫ్ట్ కడుతుందా? ప్రభుత్వం కట్టి ఇస్తుందా అన్నది తెలియడం లేదు. ఎంవోయూ సమయంలో దీనిపై స్పష్టత రానుంది. వాస్తవానికి అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలో 50 క్యూ బిట్స్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేసింది. అయితే క్వాంటం టెక్నాలజీ పై ఏపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్న నేపథ్యంలో అమరావతిలో పరిశోధనా కేంద్రం కోసం ఎంచుకుంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ హైదరాబాదులో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. అమరావతి క్వాంటం వ్యాలీలో 90 లక్షల చదరపు అడుగుల సదుపాయాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 40 చదరపు అడుగులు ఐబీఎం కోసం, ఐటీ హార్డ్వేర్ తయారీ కంపెనీల కోసం ఒక భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఇప్పుడు మైక్రోసాఫ్ట్ వస్తుండడంతో ప్రపంచ దిగ్గజ సంస్థల చూపు అమరావతి పై పడే అవకాశం ఉంది. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ అమెజాన్, అయాన్ క్యు వంటి సంస్థలు క్వాంటం కంప్యూటింగ్ రంగంలో అనేక సాంకేతికలపై పరిశోధనలు చేస్తున్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీకి సంబంధించి అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలన్నది చంద్రబాబు టార్గెట్. తద్వారా ప్రపంచంలో క్వాంటం ద్వారా రాణించాలనుకుంటున్న దిగ్గజ సంస్థలను తన వైపు తిప్పుకోవాలన్నదే చంద్రబాబు లక్ష్యం. మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సంస్థ అమరావతికి వస్తే మాత్రం.. ఒక విధంగా చెప్పాలంటే అనుకూల వాతావరణం ఏర్పాటు అవుతుంది. స్వల్ప కాలంలోనే అమరావతి క్వాంటం వ్యాలీ అంతర్జాతీయ స్థాయికి ఎక్కడం ఖాయం.

# సింగరాయకొండలో కనిపించని పెద్ద భవనాలు


ఒంగోలు, : భారీగా సంపాదించినా..కోట్ల ఆస్తులున్నా..ఎంత గొప్పోళ్లైనా..ఎవ్వరైనా భగవంతుడి ముందు తగ్గాల్సిందే. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో-భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు. ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. పాత సింగరాయకొండలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఈ స్వామివారంటే స్థానికులకు ఎంతో భక్తి. ఎంత అంటే..ఈ ఊర్లో ఉండే ఒక్క నివాసం కూడా స్వామివారి ఆలయాన్ని మించిన ఎత్తులో ఉండకూడదు. తరతరాలుగా ఇదే నియమం పాటిస్తున్నారు. ఒకప్పుడు పూరిపాకలు ఉండేవి, ఆ తర్వాత అవి పెంకుటిల్లుగా మారాయి..ఆ తర్వాత డాబాలొచ్చాయి..అంతే..అక్కడితోనే ఆగిపోయారు. మరో ఫ్లోర్ అదనంగా వేసే సాహసం మాత్రం చేయలేదు. స్వామివారి ఆలయం కన్నా ఏ ఇల్లు కూడా ఎత్తుగా కనిపించకూడదు అనే నియమానికి కట్టుబడి ఉండిపోయారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు. తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి. రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. ఇళ్ల సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు. డబ్బుల్లేకకాదు.. కానీ స్వామిని మించి ఉండకూడదు అనే నియమం. ఎవరైనా ఆలయ నిర్మాణాన్ని దాటి కడితే ఆ భవనం కూలిపోతుందని అక్కడే పుట్టి అక్కడే పెరిగిన ఓ పెద్దావిడ చెప్పారు . వాస్తవానికి మూడు అంతస్తులు నిర్మించినా కొండంత ఎత్తురాదు కానీ పూర్వకాలం నుంచి ఉండిపోయిన నమ్మకం అది. భక్తో, భయమో కానీ ఈ ఊర్లో ఈ సెంటిమెంట్ బలపడిపోయిందంటారు అక్కడున్న పురోహితులు. దక్షిణ సింహాచలంగా పిలిచే ఆ ఆలయాన్ని పల్లవులు కట్టించారు...విజయనగరం చక్రర్తులు అభివృద్ధి చేశారని అక్కడున్న శాసనాల్లో ఉంది. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో-భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు. ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు. తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు పల్లవుల కాలం నుంచి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని విజయనగర రాజులు కూడా సందర్శించారు..

దానాలు చేశారని ఇక్కడ శాసనాల్లో ఉంది. ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి. రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు. మొత్తానికి భక్తో-భయమో పాత సింగరాయకొండవాసులు అనుసరిస్తున్న ఈ నియమం ఇప్పటికి అయితే కొనసాగుతోంది..మరి భవిష్యత్ తరాలు కూడా అనుసరిస్తారా?...

# మణిపూర్ లో ముగ్గురు మిలిటెంట్లు అరెస్టు



ఇంఫాల్ : మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు, కాక్చింగ్ జిల్లాల నుండి రెండు నిషేధిత సంస్థలకు చెందిన ముగ్గురు మిలిటెంట్లను భద్రతా దళాలు అరెస్టు చేశాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మందుగుండు సామగ్రి వ్యాపారంలో పాల్గొన్నారనే ఆరోపణలపై ఇంఫాల్ పశ్చిమ జిల్లా నుండి మరో ముగ్గురిని కూడా అరెస్టు చేసినట్లు తెలిపింది. నిషేధిత ప్రీపాక్‌కు చెందిన స్వయం ప్రకటిత సార్జెంట్ మేజర్‌ను శనివారం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కొంతా అహల్లప్‌లోని అతని నివాసం నుండి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతను మయన్మార్‌లోని తనల్‌లో ప్రాథమిక సైనిక శిక్షణ పొందాడని, గత సంవత్సరం అక్టోబర్‌లో ఆ సంస్థ కోసం ఒక కేడర్‌ను నియమించుకున్నాడని పోలీసులు తెలిపారు. జిల్లా, పరిసర ప్రాంతాలలో దోపిడీ కార్యకలాపాలలో పాల్గొన్నారనే ఆరోపణలతో నిషేధిత యుపిపికెకు చెందిన ఇద్దరు క్రియాశీల సభ్యులను ఆదివారం కాక్చింగ్‌లోని ఒక మార్కెట్ నుండి అరెస్టు చేసినట్లు పోలీసు ప్రకటన తెలిపింది. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని తంగ్మెయిబ్, ఖుయాతోంగ్ పోలెం లైకై ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఆదివారం అక్రమ మందుగుండు సామగ్రి అమ్మకాలకు పాల్పడినందుకు భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు తెలిపింది. వారి వద్ద నుండి 100కి పైగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రెండేళ్ల క్రితం జాతి హింస చెలరేగినప్పటి నుండి మణిపూర్‌లో భద్రతా దళాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. మే 2023 నుండి మెయితీస్ మరియు కుకి-జో గ్రూపుల మధ్య జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యమంత్రి ఎన్. బిరెన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది.



# ఆలుగడ్డలను ఈ విధంగా మాత్రం తినకండి..


## లాభం కలగదు సరికదా, తీవ్రంగా నష్టం ఉంటుంది..

ఆలుగడ్డలను సహజంగానే చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. వీటితో వేపుడు చేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. అలాగే కుర్మా, టమాటా కూర కూడా చేసి తినవచ్చు. ఆలుతో చిప్స్‌ను కూడా తయారు చేసి తింటారు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. కానీ ఆలును వేపుళ్లు, చిప్స్ లాంటి రూపంలో తింటే మనకు జరిగే మేలు ఏమీ ఉండదు. కానీ నష్టం మాత్రం అధికంగా ఉంటుంది. అదే ఆలుగడ్డలను ఉడకబెట్టి లేదా కూరగా చేసి తింటేనే మనకు లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డల్లో మన శరీరానికి కావల్సిన పలు ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఆలుగడ్డల్లో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు శక్తిని అందిస్తాయి. ఒక మీడియం సైజు ఆలుగడ్డలో సుమారుగా 26 గ్రాముల మేర పిండి పదార్థాలు ఉంటాయి.

**క్యాన్సర్ రాకుండా..:** ఆలుగడ్డను పిండి పదార్థాలకు మంచి నెలవుగా చెప్పవచ్చు. ఇది శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తుంది. కానీ అధికంగా తింటే మాత్రం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారికి కావల్సిన శక్తిని ఆలుగడ్డలు అందిస్తాయి. కనుక వారు రోజూ వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. అలాగే ఆలుగడ్డలో ఉండే పలు సమ్మేళనాలు పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆలుగడ్డలను మోతాదులో తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ట్రై గ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. ఆలుగడ్డలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. వేయించి లేదా పచ్చిగా తినకూడదు. ఇవి సరిగ్గా జీర్ణం కావు. **పోషకాలు అధికంగా..:** 150 గ్రాముల మేర ఆలుగడ్డలను తింటే 27 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. మనకు రోజుకు కావల్సిన విటమిన్ సి లో ఇది 45 శాతం. అలాగే 630 మిల్లీగ్రాముల మేర పొటాషియం, 0.2 మిల్లీగ్రాముల విటమిన్ బి6, స్వల్ప మోతాదులో థయామిన్, రైబోఫ్లేవిన్, ఫోలేట్, నియాసిన్, మెగ్నిషియం, ఐరన్, జింక్ తదితర పోషకాలు వీటి ద్వారా లభిస్తాయి. ఆలుగడ్డలను పైన పొట్టుతో తింటే మేలు. చాలా మంది పొట్టు తీసేసి తింటారు. దీని వల్ల అనేక పోషకాలను, ముఖ్యంగా ఫైబర్‌ను కోల్పోవాల్సి వస్తుంది. ఆలుగడ్డలను బాగా కడిగి తొక్కతో సహా ఉడకబెట్టి తింటే మేలు జరుగుతుంది. ఆలుగడ్డల్లో కార్టినాయిడ్స్, పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయి.


**అందానికి కూడా..:** ఆలుగడ్డలు కేవలం ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాదు, అందానికి కూడా పనిచేస్తాయి. ఆలుగడ్డలను గుజ్జుగా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించవచ్చు. దాన్నే జుట్టుకు రాసి హెయిర్ ప్యాక్‌లా వాడవచ్చు. దీంతో చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఆలుగడ్డలను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి అనంతరం వాటిని తీసి చక్రాల్లా అడ్డంగా కట్ చేయాలి. ఆ ముక్కలను కళ్లపై 15 నిమిషాల పాటు పెట్టుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే కళ్ల కింద ఉండే డార్క్ సర్కిల్స్ మాయం అవుతాయి. ఆలుగడ్డల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. వీటిల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలుగడ్డలు ఆరోగ్యానికి ప్రయోజనకరమే అయినప్పటికీ వీటిని అధికంగా తినకూడదు. అధిక బరువు ఉన్నవారు, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు వీటిని తినాలి.

## కోలన్ క్యాన్సర్ కారకాలు



మనిషిని దీర్ఘకాలంపాటు పట్టి పీడించే వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనది. క్యాన్సర్లలో పెద్దపేగు (కోలన్) క్యాన్సర్ ఒకటి. అయితే, మనలో చాలామందికి కోలన్ క్యాన్సర్ ముప్పును పెంచే జీవనశైలి అలవాట్ల గురించి అంతగా తెలియదని ఓహియో స్టేట్ యూనివర్సిటీ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఊబకాయం, మద్యపానం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు పెద్దపేగు క్యాన్సర్‌కు దోహదపడతాయికాబట్టి, దీనికి సంబంధించి అనుమానంగా అనిపించినా, డాక్టర్లు అవసరమని చెప్పినా.. 45 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కొలనోస్కోపీ చేయించుకోవడం మంచిదట. వీలైతే ఇంకా ముందే మేల్కోవాలని పరిశోధకులు సూచించారు.

## ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు. ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి. ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా.. ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుం ది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగను రోజూ సేవించడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..:** మజ్జిగ ప్రొ బయోటిక్ ఆహారాల జాబితాకు చెందినది. అందువల్ల మజ్జిగను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.

ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణంఅయ్యేలా చేస్తుంది.కడుపుఉబ్బరం, అసిడి టీ, గ్యాస్‌సమస్యల నుంచి ఉపశమనంలభిస్తుంది.మలబద్దకం తగ్గు తుంది. మజ్జిగలోక్యాల్షియం సమృద్ధిగాఉంటుంది.అందువల్ల మజ్జిగ ను రోజూ సేవిస్తే ఎముకలు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్ఉంటుంది.ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి మజ్జిగ మంచి ఆహారం అని చెప్పవచ్చు. మజ్జిగలో ప్రోటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటాయి. పెరుగుతో పోలిస్తే మజ్జిగలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తాగితే ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో ఆహార్ తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. మజ్జిగను తాగడం వల్ల వేసవిలో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..:** మజ్జిగలో అనేక ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మజ్జిగలో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుం ది. హైబీపీ ఉన్నవారు మజ్జిగను సేవిస్తుంటే ప్రయోజనం ఉంటుంది. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. మజ్జిగలో ఉండే రైబోఫ్లేవిన్ లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో లివర్‌లో ఉండు వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు రోజూ మజ్జిగను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. చర్మ సంరక్షణకు కూడా మజ్జిగ మేలు చేస్తుంది. మజ్జిగను సేవిస్తుంటే డ్యామేజ్ అయిన చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. ఇలా మజ్జిగను రోజూ సేవిస్తే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# మహిళలూ.. ఈ పోషకాలు అందేలా చూసుకోండి!




గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళ లకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమ వుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి. యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి: చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్లు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్ఒ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, ఫిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్–ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్–ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్–సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్–డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్–డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్లు రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.

విటమిన్–బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్–బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్–బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్–బి9 : ముఖ్యమైన విటమిన్లలో 'బి9' (ఫోలిక్ యాసిడ్) కూడా ఒకటి. ఇది గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది ఆకుకూరలు, బీన్స్, పప్పు ధాన్యాలు, అరటిపండ్లు, చేపల్లో ఎక్కువగా ఉంటుంది.

విటమిన్–బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్–బి12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇది చేపలు, పాలు, గుడ్డు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215